మంగళవారం 14 మే 2024

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**నేడు వారణాసికి చంద్రబాబు**

**ప్రధాని మోదీ నామినేషన్‌కు హాజరు**

అమరావతి(చైతన్యరథం): టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం ఉత్తరప్రదేశ్ లోని వారణాసి వెళతారు. అక్కడ జరిగే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నామినేషన్ కార్యక్రమానికి హాజరవుతారు.



రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజాకాంక్ష ఎంతబలంగా ఉందో పోలింగ్ సరళి స్పష్టం చేసింది. వైసీపీ కుట్రలు ఎక్కడికక్కడ భగ్నం చేశాం. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల హింసను ప్రేరేపించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. టీడీపీ శ్రేణులు ఎక్కడికక్కడ ధీటుగా ఎదుర్కోవడంతో వైసీపీ నాయకుల ఆటలు సాగలేదు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కసి ఓటర్లలో స్పష్టంగా కనిపించింది. ఇప్పుడిక -ఊహించని ఫలితాలు చూడబోతున్నాం.

-చంద్రబాబు నాయుడు



ఎన్డీయే కూటమి విజయం తథ్యం. ఓటర్లు ఈ దిశగా స్పష్టమైన తీర్పు ఇచ్చారు. భారీ మెజార్టీతో కూటమి అభ్యర్థులు గెలవబోతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సుపరిపాలన అందడం ఖాయం. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఆంధ్రప్రదేశ్ పురోగమనానికి తగిన విధంగా పనిచేస్తుందని హామీ ఇస్తున్నా.

- పవన్ కల్యాణ్



ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఉప్పెనలా వచ్చిన ఓటరు దేవుళ్లకు పాదాభివందనం. ప్రజాతీర్పును తారుమారు చేసేందుకు వైసీపీ కుట్రలను ప్రజలు తిప్పికొట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరడం వెల్లివిరిసిన ప్రజాచైతన్యానికి నిదర్శనం. భావితరాల కోసం అరాచక శక్తులకు ఎదురొడ్డి ప్రజలు చూపిన తెగువ చరిత్రలో నిలిచిపోతుంది.

- నారా లోకేష్



# తీర్పు పదిలం

- మార్పు కోసం ఓటెత్తిన చైతన్యం
- ఎండనక, వాననక బారులు తీరిన ఓటర్లు
- జగన్‌రెడ్డి హింసాత్మక కుట్ర భగ్నం
- గ్రామాలు, పట్టణాల్లో ఒకే రీతిన ప్రజా తిరుగుబాటు
- సాయంత్రం 6 తర్వాత కూడా బూత్‌ల వద్ద వందలాది ఓటర్లు
- కూటమి భారీ విజయం, జగన్‌రెడ్డి ఓటమి తథ్యమని సర్వత్రా అభిప్రాయం
- మాచర్ల, పుంగనూరులతో సహా 10 నియోజకవర్గాల్లో హింసాత్మక ఘటనలు
- తెనాలి వైసీపీ ఎమ్మెల్యేను తిరిగి చెంపదెబ్బ వేసిన కసి
- వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి అరెస్టు. అన్నాబత్తుని, పిన్నెల్లిల హౌస్ అరెస్టు
- పోలింగ్ రోజున కూడా ఓట్ల కోసం ప్రాధేయపడ్డ జగన్‌రెడ్డి
- రోజంతా పోలింగ్ సరళిని సమీక్షించిన చంద్రబాబు
- చారిత్రాత్మక తీర్పు రానుందని తెదేపా అధినేత విశ్వాసం

బిడ్డ తప్పు చేస్తే దండించడం పెద్దల బాధ్యత. నవ్యాంధ్రులు అదే చేశారు. సరిదిద్దుకోలేనన్ని తప్పులు చేసిన జగన్ బిడ్డను చాచి చెంపమీద కొట్టారు. అతని పార్టీని విసిరికొట్టారు. ఐదేళ్ల జగనాసుర పాలనతో ఎంత నలిగిపోయారో.. అంతకు రెట్టించిన కసితో 'బటన్' నొక్కారు. ఓటు హక్కుతో భారీ తిరుగుబాటుకు దిగారు. జగన్ విధ్వంస పాలనను తిప్పికొడుతూనే.. నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు అనుకూల తీర్పునిచ్చారు. ఓటెత్తిన ప్రజా చైతన్యం వైసీపీని ముంచెత్తింది. ప్రజా న్యాయస్థానంలో వెల్లడైన తీర్పు ఎలక్ట్రానిక్ ఓటు యంత్రంలో నమోదైంది. స్ట్రాంగ్‌రూమ్‌ల్లో పదిలమైంది. ఈ ప్రజాతీర్పు జూన్ 4న ఫలితాల వెల్లడితో ఓ చారిత్రక అధ్యాయం కానుంది.

2

## ఫలించిన చంద్రబాబు వ్యూహం!

- కూటమితో రాష్ట్ర పునర్నిర్మాణానికి పొందిన మోదీ హామీ
- జగన్‌రెడ్డి ఎన్నికల కుట్రలకు అడ్డుకట్ట

5

## చీఫ్ కమాండర్ చంద్రబాబు

- పోలింగ్ సరళిపై అనుక్షణం అప్రమత్తం.. నిరంతర సమీక్ష
- ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులపై సూచనలు
- సేనకు సూచనలు, సలహాలు, దిశానిర్దేశం
- రోజంతా పార్టీ వార్ రూమ్‌లో గడిపిన అధినేత

6

## పోలింగ్ 80 శాతం పైనే!

- భారీ పోలింగ్ జరిగిందన్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి
- అధికారిక సమాచారం నేడు వెల్లడి

6

## సజ్జలలో ఓటమి భయం

వాస్తవాలను దాచేసి ఈసీపై నిందలేస్తున్నారని దేవినేని ధ్వజం

7

## దాడులు.. కిడ్నాప్‌లు

# పెట్రోలు బాంబులు!!



పోలింగ్ అనంతరం నరసరావుపేటలో వైసీపీ మూకల అరాచకం

- పోలింగులో రక్తపాతం సృష్టించిన వైసీపీ
- పల్నాడులో రెచ్చిపోయిన జగన్ మూకలు
- తలలు పగులకొట్టి అరాచకం సృష్టించిన వైసం
- ఓటర్లపైకి విసిరిన పెట్రోలు బాంబులు
- పలుచోట్ల ధ్వంసమైన వాహనాలు, ఈవీఎంలు
- పుంగనూరు పరిధిలో తెదేపా ఏజెంట్ల కిడ్నాప్
- తాడిపత్రిలో కేతిరెడ్డి ఓవరాక్షన్.. అరెస్ట్
- తెనాలి వైసీపీ అభ్యర్థి చెంప చెళ్లుమనిపించిన ఓటరు

ఊహించినట్టే.. పోలింగ్‌పై వైసీపీ పగబట్టింది. ఎన్నికల హింసకు తెగబడింది. విపక్షాల రక్తం కళ్లచూసింది. దాడులు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌లు, పెట్రోలు బాంబులతో చెలరేగిపోయింది. వాహనాలు తగులబెట్టింది. ఈవీఎంలను ధ్వంసం చేసింది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి.. భయానక వాతావరణంలోనే పరిస్థితి చక్కదిద్దుకునే కుట్రకు ఒడిగట్టింది.

(పూర్తి కథనాలు 3,4 పేజీలలో)

చైతన్యరథం

# తీర్పు పదిలం

- మార్పు కోసం ఓటెత్తిన చైతన్యం
- ఎండనక, వాననక బారులు తీరిన ఓటర్లు
- జగన్‌రెడ్డి హింసాత్మక కుట్ర భగ్నం
- గ్రామాలు, పట్టణాల్లో ఒకే రీతిన ప్రజా తిరుగుబాటు
- సాయంత్రం 6 గంటల తర్వాత కూడా బూత్‌ల వద్ద వందలాది ఓటర్లు
- కూటమి భారీ విజయం, జగన్‌రెడ్డి ఓటమి తథ్యమని సర్వత్రా అభిప్రాయం
- మాచర్ల, పుంగనూరులతో సహా 10 నియోజకవర్గాల్లో హింసాత్మక ఘటనలు
- తెనాలి వైసీపీ ఎమ్మెల్యేను తిరిగి చెంపదెబ్బ వేసిన కసి
- వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి అరెస్టు, అన్నాబత్తుని, పిన్నెల్లి హౌస్ అరెస్టు
- పోలింగ్ రోజున కూడా ఓట్ల కోసం ప్రాధేయపడ్డ జగన్‌రెడ్డి
- రోజంతా పోలింగ్ సరళిని సమీక్షించిన చంద్రబాబు
- చారిత్రాత్మక తీర్పు రానుందని తెదేపా అధినేత విశ్వాసం



అమరావతి (చైతన్య రథం): ఐదేళ్లుగా రాష్ట్రంలో జగనాసుర పాలనతో విసిగి వేసారిన రాష్ట్ర ప్రజలు అనుకున్నది చేశారు. తమ ఓటు హక్కుతో భారీస్థాయిలో తిరుగుబాటు చేశారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో విధ్వంసమైన నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు అనుకూలంగా తమ తీర్పునిచ్చారు. ప్రజా చైతన్యం ఓట్ల రూపంలో పోటెత్తి రాష్ట్రాన్ని గట్టిగా తాకింది. ప్రజా న్యాయస్థానంలో వెల్లడైన తీర్పు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో (ఈవీయంలు) నమోదై స్ట్రాంగ్‌రూమ్‌ల్లో పదిలంగా భద్రపరచబడింది. కూటమి భారీ విజయం, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఓటమితో రాష్ట్రాన్ని పదిలం చేసుకునే ఈ ప్రజాతీర్పు ఓ చారిత్రాత్మక అధ్యాయంగా మిగలనుంది.

## ఓటర్ల బారులు

పోలింగ్ ప్రారంభానికి నిర్ణీత ఉదయం 7 గంటలకు ముందే రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు పోలింగ్‌బూత్‌ల ముందు బారులు కట్టారు. గ్రామాలు, పట్టణాల్లో ఒకటే తీరు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో సృష్టించిన విష ఘడియలను తరిమికొట్టి, నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి తిరిగి బాటలు వెయ్యాలనే చైతన్యం, కసి ఓటర్లలో స్పష్టంగా కనిపించింది. మాక్ పోలింగ్‌లో కొన్నిచోట్ల ఈవీయంలు పనిచేయకపోవడం, పోలింగ్ ప్రారంభమైన తర్వాత పలుచోట్ల ఈవీయంలు మొరాయించడం, వాటిని సరిచేయడం, ఈవీయంలను ఆపరేట్ చేయడంలో కొంతమంది ఎన్నికల సిబ్బంది తడబాట్లతో పోలింగ్ ప్రారంభంలో కొంత మందగమనంతో నడిచింది. కొన్నిచోట్ల వర్షం పడగా మధ్యాహ్నం ఎండ తీవ్రత కొనసాగింది. క్రమేణా పుంజుకుని భారీ పోలింగ్‌కు దారితీసింది. పోలింగ్ ముగింపునకు నిర్ణీత సాయంత్రం 6 గంటల తర్వాత కూడా పలుచోట్ల వందలాది ఓటర్లు క్యూలలో నిలుచున్నారు. నియమాల ప్రకారం వారందరికీ ఓటు వేసే అవకాశాన్ని ఇచ్చి పోలింగ్ పూర్తి చేయడానికి రాత్రి బాగా ఆలస్యం కావచ్చని ఎన్నికల అధికారులు అన్నారు.

## కుట్రలకు తెరతీసిన జగన్ బృందం

తెదేపా-భాజపా-జనసేన కూటమి ఏర్పాటుతో తన ఓటమి అనివార్యమని గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పోలింగ్ రోజున పలు కుట్రలకు పాల్పడతారని కూటమి నేతలు, ప్రజలు, పరిశీలకులు ముందుగానే ఊహించారు. ఆ ఊహలను పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే వైసీపీ మూకలు నిజం చేశాయి. ఉదయాన్నే ఓటర్లు బారులు తీరడంతో మాచర్ల, పుంగనూరులలో వైసీపీ రౌడీలు హింసాత్మక ఆగడాలకు తెరతీశారు. హింసా సంఘటనలతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్‌ను తగ్గించాలనే వ్యూహానికి శ్రీకారం చుట్టారు.

## 10 నియోజకవర్గాల్లో హింసాత్మక ఘటనలు

ఏ విధంగానైనా మరోసారి అధికారాన్ని చేపట్టాలన్న ముఖ్యమంత్రి రాజకీయ వాంఛకు అనుగుణంగా వైసీపీ మూకలు తమ ఆగడాలను అన్నిచోట్లా విస్తరించాలని ప్రయత్నం చేశాయి. అయితే కూటమి అభ్యర్థులు, నేతలు, కార్యకర్తల తీవ్ర ప్రతిఘటనతో వైసీపీ కుట్ర ఆశించిన మేర ఫలించలేదు. కూటమి అభ్యర్థుల ఎన్నికల ఏజెంట్లపై దాడులు, వారి కిడ్నాప్‌లు, వారి మద్దతుదారులైన ఓటర్లను భయభ్రాంతులను చేయడం, కూటమి అభ్యర్థుల వాహనాలపై వైసీపీ మూకల దాడులు దాదాపు 10 శాసనసభ నియోజకవర్గాల్లో జరిగాయి. పల్నాడులోని మాచర్ల, నరసరావుపేట, గురజాల నియోజకవర్గాల్లో అధిక మోతాదులో వైసీపీ మూకల హింసాత్మక ఘటనలు జరిగాయి. రాయలసీమలోని తాడిపత్రి, చిత్తూరు, కుప్పం, ధర్మవరం, పుంగనూరు, రైల్వేకోడూరు, కమలాపురం మరియు కోస్తాంధ్రలోని పెనమలూరు, తిరువూరు నియోజకవర్గాల్లో వైసీపీ మూకలు హింసకు పాల్పడ్డాయి.

నరసరావుపేట లోక్‌సభ లావు శ్రీకృష్ణదేవరాయల కాన్వాయ్‌పై వైసీపీ నేతలు దాడిచేసి మూడు కార్లను ధ్వంసం చేశారు. అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు వాహనాలపైనా దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ రోజున జరిగిన పలు దురాగతాలపై ఎప్పటికప్పుడు తెలుగుదేశం పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేస్తూ పలు లేఖలు రాసి శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

## పోలింగ్ రోజున కూడా జగన్‌రెడ్డి దిగజారుడుతనం

వైనాట్ 175 అంటూ తరచుగా డాంబికాలు పలికిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఇటీవల పలుమార్లు తనలో నెలకొన్న ఓటమి భయాన్ని వ్యక్తం చేశారు. దాన్ని కొనసాగిస్తూ ఎన్నికల కోడ్‌ను నిస్సిగ్గుగా ఉల్లంఘించి పోలింగ్ రోజున కూడా ఓట్ల కోసం దీనంగా అభ్యర్థించారు. తన పార్టీకే ఓట్లు వేయాలని ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రాధేయపడ్డారు. గుంటూరు పశ్చిమ వైసీపీ అభ్యర్థి మంత్రి విడదల రజని కూడా దిగజారి ప్రవర్తించారు. ముఖ్యమంత్రి అనైతిక ప్రవర్తనతో.. పోలింగ్‌లో తన ఓటమి తథ్యమని తానే చెప్పుకున్నట్లయిందని పరిశీలకులు వ్యాఖ్యానించారు.

## వెల్లడైన ప్రజల కసి

ఐదేళ్లుగా పోలీసు యంత్రాంగం దుర్వినియోగంతో ప్రతిపక్ష నేతలను, రాష్ట్ర ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి పోలింగు రోజున సామాన్యుడు షాకిచ్చాడు. ఒక అధికార పార్టీ ఎమ్మెల్యేను ఒక ఓటరు గట్టిగా చెంపదెబ్బ కొట్టాలంటే ఎంత ధైర్యముండాలి? తెనాలిలో అదే జరిగింది. తెనాలి వైసీపీ శాసనసభ్యుడు అన్నాబత్తుని శివకుమార్ పోలింగ్ స్టేషన్ వద్ద ప్రవర్తనను సుధాకర్ అనే ఓటరు ప్రశ్నించగా అతన్ని ఎమ్మెల్యే గట్టిగా చెంపదెబ్బ కొట్టాడు. ఏమాత్రం బెదరకుండా శివకుమార్ తిరిగి అన్నాబత్తుని చెంప వాయించాడు. ఇది టీవీల్లో ప్రత్యక్షంగాను, సోషల్ మీడియాలో చూసిన ప్రజలను ఎంతో సంతోషానికి గురి చేసింది. ఈ ఎన్నికల్లో జగన్‌రెడ్డి సీను పూర్తిగా రివర్స్ అయ్యిందనడానికి ఇది ఒక ప్రత్యక్ష సాక్ష్యమని ప్రజలు, పరిశీలకులు వ్యాఖ్యానించారు.

## ఎన్నికల సంఘం సీరియస్

పోలింగ్ రోజున వైసీపీ నేతల ఆగడాలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. రాయదుర్గంలో ఆగడాలకు దారితీసిన వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సత్వర అరెస్టుకు ఆదేశాలు జారీ చేసింది. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లను పోలింగ్ పూర్తయ్యేవరకు హౌస్ అరెస్టు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. వారిపై కేసులు పెట్టాలని కూడా ఆదేశించింది. పుంగనూరులో జరిగిన సంఘటనలో నిందితులను వదిలేసిన ఎస్పైని వెంటనే సస్పెండ్ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ మీనా ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రం 4-6 గంటల మధ్య ఎటువంటి సంఘటనలు జరిగినా తీవ్ర చర్యలు తీసుకోబడతాయని ఆయన హెచ్చరించారు.

## చంద్రబాబు హర్షం

రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ రోజున వెల్లివిరిసిన చైతన్యంపై తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు హర్షం వ్యక్తం చేసి భారీగా తరలివచ్చిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. సమయం ముగిసినా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరడం, ఉత్సాహంగా ఓటు వేయడం రాష్ట్రానికి శుభ పరిణామమని ఆయన ట్వీట్ చేశారు. నిన్న ప్రజలు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకం కాబోతుందని అన్నారు. కేవలం డబ్బుతోనే గౌరవప్రదమైన జీవితం లభించదని, పేదవాడైనా, ఇతరులకైనా స్వేచ్ఛ, స్వతంత్రం, ఇతర కనీస హక్కులతో కూడిన గౌరవప్రదమైన జీవితాన్ని ప్రజాస్వామ్యం మాత్రమే కలిగిస్తుందని, పవిత్రమైన ఓటు హక్కుతో అట్టి గౌరవమైన జీవితం కోసం, ప్రజాస్వామ్య రక్షణ కోసం ప్రతి ఓటరు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

---

# పోలీసులకూ రక్షణ లేదా?

## అస్మిత్‌రెడ్డిపై దాడి వైసీపీ అరాచకాలకు పరాకాష్ఠ: చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): తాడిపత్రిలో పోలింగ్ సందర్భంగా హింస చోటుచేసు కోవడం పట్ల టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. పోలింగ్‌లో వైసీపీ హింస ఎంతవరకు వెళ్లిందంటే... కనీసం పోలీసులకు కూడా రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు.

తాడిపత్రిలో ఏకంగా ఎస్పీ వాహనంపైనే దాడి చేయడం, తాడిపత్రి టీడీపీ అభ్యర్థి అస్మిత్‌రెడ్డిపై దాడికి దిగడం వైసీపీ హింసా రాజకీయాలకు పరాకాష్ఠ అని ధ్వజ మెత్తారు. జగన్ ఐదేళ్లుగా పెంచి పోషించిన రౌడీ మూకలు ఈ రోజు తమ దాడుల ద్వారా ప్రజల్లో భయం పుట్టించి పోలింగ్ శాతాన్ని తగ్గించడం ద్వారా లబ్ధి పొందే కుట్ర చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు.

ప్రజలు ఈ కుట్రలను తిప్పి కొడతారని, అత్యధిక ఓటు శాతంతో వైసీపీ హింసా రాజకీయానికి ముగింపు పలుకుతారని ఉద్ఘాటించారు. ఈ మేరకు తాడిపత్రి ఘటనల తాలూకు వీడియోను కూడా పంచుకున్నారు.

### జగన్ కోరలు పీకే సమయం వచ్చింది: లోకేష్

ప్రజాస్వామ్య పండుగైన ఓటింగ్ రోజు కూడా తాడిపత్రిలో వైసీపీ మారణహోమం చూసి ఆవేదన కలుగుతోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. టీడీపీకి అనుకూలంగా ఓటింగ్ జరుగుతోందని పోలీసులను కూడా కొడుతున్న వీళ్లా మన నేతలని ప్రశ్నించారు. ఇలాంటి ఫ్యాక్షన్ పోకడలను పెంచి పోషిస్తున్న జగన్ కోరలు పీకే సమయం వచ్చింది. మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ఈ అల్లరి మూకలను రాష్ట్ర పొలిమేరల వరకు తరిమికొడతామని లోకేష్ హెచ్చరించారు.

చైతన్యరథం

# దాడులు.. కిడ్నాప్‌లు
# పెట్రోలు బాంబులు!!

- పోలింగులో రక్తపాతం సృష్టించిన వైసీపీ
- పల్నాడులో రెచ్చిపోయిన జగన్ మూకలు
- తలలు పగులకొట్టి అరాచకం సృష్టించిన వైనం
- ఓటర్లపైకి విసిరిన పెట్రోలు బాంబులు
- పలుచోట్ల ధ్వంసమైన వాహనాలు, ఈవీఎంలు
- భయబ్రాంతులకు గురైన పల్నాడు ప్రజలు
- పుంగనూరు పరిధిలో తెదేపా ఏజెంట్ల కిడ్నాప్
- తాడిపత్రిలో కేతిరెడ్డి ఓవరాక్షన్.. అరెస్ట్
- తెనాలి వైసీపీ అభ్యర్థి చెంప చెళ్లుమనిపించిన ఓటరు
- గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థిపై మహిళల తిరుగుబాటు
- దాడి చేసిన వారిపై కేసులు: డిజీపీ విజయారావు



పోలింగ్ అనంతరం నరసరావుపేటలో వైసీపీ మూకల అరాచకం





అమరావతి (చైతన్యరథం): ఊహించినట్టే పాలక పక్షం ఎన్నికల హింసకు తెగబడింది. ఓటమి భయంతో పోలింగ్ రోజున దాడులు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌లు, పెట్రోలు బాంబులతో చెలరేగిపోయింది. ప్రజలను భయ బ్రాంతులకు గురిచేసి.. భయానక వాతా వరణం లోనే పరిస్థితి చక్కదిద్దుకునే కుట్రకు ఒడిగట్టింది. పార్టీ అధిష్టానం ఇచ్చిన డైరెక్షన్‌తో ద్వితీయశ్రేణీ యంత్రాంగం రౌడీయిజాన్ని ప్రదర్శించారు. అనేకచోట్ల దౌర్జన్యాలకు తెగబడి ఎన్నికలకు భంగం కలిగించే కుతంత్రాన్ని అమలు చేశారు. చాలాచోట్ల తెలుగుదేశం ఎన్నికల ఏజెంట్లను కిడ్నాప్ చేసి ఉద్రిక్త పరిస్థితులు లేవనెత్తారు. చివరిగా ఓటర్లను చెల్లాచెదురు చేసేందుకు పెట్రోల్ బాంబులు విసిరి భయానక వాతావరణం సృష్టించారు. ఓటమి అంచనవున్న వైసీపీ హింసామార్గాన్ని అనుసరించ వచ్చన్న అంచనాలు ఉండటంతో, తెదేపా సమర్థంగా ఎదుర్కొంది. సంయ మనం పాటిస్తూ.. అవసరమైన చోట ప్రతిఘటిస్తూ.. ఎన్నికల సజావుగా సాగేందుకు దోహదపడింది. భయా నక వాతావరణం సృష్టించి పోలింగ్ శాతం తగ్గించ గలిగితే గెలుపు నల్లేరుపై నడకేనన్న వైసీపీ కుట్రను.. విపక్ష కూటమి సేనలు సమర్థంగా తిప్పికొట్టింది.

రాష్ట్రంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద వైకాపా నేతలు దౌర్జన్యాలకు తెగబడ్డారు. ఏజెంట్లపై దాడులు, కిడ్నాప్ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పల్నాడు ప్రాంతంలోని నరసరావుపేట, మాచర్ల, గురజాల, చిత్తూరు జిల్లాలోని పీలేరు, పుంగనూరు, కుప్పం, చంద్రగిరి, అనంతపురం జిలా ధర్మవరం, తాడిపత్రి, కడప జిల్లాలోని జమ్మలమడుగు, మైదుకూరు తదితర ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డారు. వైకాపా నేతల తీరుపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైంది. ఒకవైపు పోలింగ్ కొనసాగుతున్నా.. వైసీపీ ప్రలోభాల పర్వాన్నీ కొనసాగించింది. పలు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిల్చున్న ఓటర్ల దగ్గరకు వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలంటూ బలవంతం పెట్టడం, బెదిరించడం వివ్వాదపర్చింది. పోలీసు బందోబస్తు ఉన్నప్పటికీ.. ఎన్నికల నిబంధనలను బేఖాతరు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. పలుచోట్ల వైకాపా నేతలు దౌర్జన్యాలకు పాల్పడ్డారు. ఎదురుతిరిగిన తెదేపా కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు. ఇన్ని జరుగుతున్నా, ఆయా ప్రాంతాల్లో ఓటర్లు వెనకడుగు వేయలేదు. కూటమి అభ్యర్థులను గెలిపించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. ఇదిలావుంటే.. వైసీపీ దుశ్చర్యలను నిలువరించాల్సిన పోలీస్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించి ప్రజా విమర్శలు మూటగట్టుకుంది.

రాష్ట్రవ్యాప్తంగా పల్నాడు, గుంటూరు వినా.. అనేక ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద తెదేపా ఎన్నికల ఏజెంట్లు, కార్యకర్తలు, సానుభూతిపరులపై వైసీపీ మూకలు విరుచుకుపడ్డాయి. ముష్టిఘాతాలు కురిపించి, కర్రలు, కత్తులతో బెదిరించి బీభత్సాన్నే సృష్టించారు. రక్తాలు వచ్చేలా గాయపర్చారు. వాహనాలు దగ్ధం చేశారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఏజెంట్లు వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లోవున్న ఏజెంట్లను బయటకు లాగిపడేశారు. కడప, ప్రకాశం, బాపట్ల, కర్నూలు, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, శ్రీకాకుళం, అనంతపురం, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో వైకాపా దాడులకు పాల్పడినా తెలుగుదేశం శ్రేణులు సమర్థంగా ఎదుర్కొన్నారు.

## భగ్గుమన్న పల్నాడు..

పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లి మండలం తంగెడలో వైకాపా శ్రేణులు నాటుబాంబులు, పెట్రోల్ సీసాలతో దాడులకు తెగబడ్డారు. పోలింగ్ ముగిసే సమయంలో ఓటు విషయంలో వైకాపా, తెదేపా వర్గీయుల మధ్య ఘర్షణ తలెత్తింది. ఓటింగ్ శాతం పెరిగితే నష్టం జరుగుతుందన్న భయంతో వైకాపా మూకలు నాటు బాంబులతో దాడికి దిగాయి. మరోవైపు రాళ్ల వర్షం కురిపించడంతో ఓటర్లు భయాందోళనకు గురై పోలింగ్ కేంద్రం నుంచి పరుగులు తీశారు. ఓటింగ్ శాతం తగ్గించేందుకే వైకాపా ఇలాంటి దాడులకు పాల్పడిందని స్థానికులే ఆరోపించడం.. వైసీపీపట్ల ప్రజలకు ఉన్న ఏవగింపు ప్రస్ఫుటమవుతుంది. ఈ ఘర్షణలో సుమారు పది ద్విచక్రవాహనాలు, నాలుగు దుకాణాలు మంటల్లో దగ్ధమయ్యాయి. బాంబు దాడులు జరుగుతున్నా పోలీసుల నుంచి కనీస స్పందన లేదని తెదేపా నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రాంతం కావడంతో పోలీసు బలగాలు కూడా సకాలంలో అక్కడికి చేరుకోలేక పోయాయని అధికారులు చెబుతున్నారు.

## రెచ్చిపోయిన అంబటి గ్యాంగు

పల్నాడు జిల్లా సకరికల్లు మండలం చీమలమర్రిలో అంబటి రాంబాబు అనుచరులు రెచ్చిపోయారు. వైకాపా మూకలు పోలింగ్ కేంద్రంపైనే దాడికి తెగబడి, 20 మంది తెదేపా కార్యకర్తలను గాయపర్చారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. దాడి ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన ఓటర్లు పోలింగ్ కేంద్రంలో తలదాచుకున్నారు. పల్నాడు జిల్లాలో ఉదయం నుంచి వైకాపా శ్రేణులు దాడులకు పాల్పడుతున్నా.. నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారని తెదేపా నేతలు ఆరోపిస్తున్నారు. దాచేపల్లి మండలం ఇరికేపల్లి, నడికుడిలోనూ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నడికుడికి చెందిన వైకాపా నేతలు ఇరికేపల్లి వచ్చి దాడులకు తెగబడ్డారు. తెదేపా కార్యకర్తలపై కర్రలు, రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో కారు, పలు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి.

## తలలు పగులగొట్టారు

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలు హింసకు దారితీశాయి. రెంటచింతల మండలం రెంటాలలో దాడి చేసి ఇద్దరు టీడీపీ కార్యకర్తల తలలు పగలగొట్టారు. ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఏజెంట్లుగా టీడీపీ వ్యక్తులు ఉంటే సహించేది లేదని వైకాపా ఉద్దేశపూర్వంకా గొడవకు దిగింది. పోలింగ్ మొదలైన అరగంటకే హింస చెలరేగడంతో ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుంది. వెంటనే పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశిస్తూ, అవసరమైతే అదనపు బలగాలను తరలించేలా చూడాలని సూచించిది.

పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద వైకాపా వర్గీయులు హల్‌చల్ చేశారు. పలువురు ఓటర్లపై దాడికి పాల్పడటంతోపాటు తెదేపా అభ్యర్థి చదలవాడ అరవింద్‌బాబు కారుపై దాడి చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీఛార్జి చేసి వారిని చెదరగొట్టారు. అక్కడితో ఊరుకోని వైకాపా మూకలు అక్కడినుంచి వెళ్లిపోయి స్థానిక తెదేపా కార్యాలయంపై దాడికి ప్రయత్నించారు. దాడిని తెదేపా శ్రేణులు తిప్పికొట్టాయి. అనంతరం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటివద్దకు వెళ్లి ఆందోళన చేపట్టాయి. దీంతో ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడికి చేరుకున్న పోలీసులు.. రబ్బర్ బుల్లెట్స్, టియర్ గ్యాస్ ప్రయోగించి ఇరు వర్గాలను చెదరగొట్టారు.

## పోలింగ్ ఏజెంట్ల కిడ్నాప్

చిత్తూరు జిల్లాలో తొమ్మిదిమంది టీడీపీ ఏజెంట్లను వైసీపీ నాయకులు కిడ్నాప్ చేశారు. పుంగనూరు పరిధిలోని సదుం మండలం బూరుగమందలో 188, 189, 190 కేంద్రాల టీడీపీ ఏజెంట్లు రాజారెడ్డి, సుబ్బరాజు, సురేంద్ర పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సమయంలో వైసీపీ నేతలు కిడ్నాప్ చేశారు. మరో ఆరుగురు పోలింగ్ ఏజెంట్లను పోలింగ్ బూత్‌ల వద్దకు రానివ్వలేదు.

## కేతిరెడ్డి సమక్షంలోనే...

అనంతపురం జిల్లా తాడిపత్రి అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలోనే వైకాపా కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. పాతకోట పోలింగ్ కేంద్రంవద్ద తెదేపా కార్యకర్తపై దాడి చేశారు. అనకాపల్లి జిల్లా ఉపమాకలో వైకాపాకు ఓటు వేయాలంటూ పోలింగ్ కేంద్రం సమీపంలోనే వాలంటీర్లు ప్రచారం చేస్తుండటంపై తెదేపా అభ్యంతరం తెలిపింది. పోలీసుల వాహనాలపైనా వైసీపీ నేతల రాళ్ల దాడికి దిగడంతో ఎస్పీ వాహనం ధ్వంసమైంది. తాడిపత్రి టీడీపీ అభ్యర్థి అస్మిత్ రెడ్డి, జేసీ కార్లు ధ్వంసం. దీంతో తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అరెస్ట్ చేశారు. పెనమలూరు నియోజకవర్గం వణుకూరులో కానిస్టేబుల్, తెదేపా వర్గీయులపై వైకాపా నేతలు దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ ఆపేందుకు ప్రయత్నించిన వైకాపా నాయకులపై తెదేపా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ప్రకాశంలో నిలిచిపోయిన పోలింగ్

శ్రీశైలంలో ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి బంధువుల హల్‌చల్ సృష్టించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన వారంతా శ్రీశైలం కాలనీలో డబ్బులు పంచుతున్నారంటూ తెదేపా ఆరోపించింది. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో అధికారపార్టీ నేతకు చెందిన ఎంఆర్‌ఎఫ్ షోరూమ్‌లో ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తుండగా అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు సోదాలు చేసి అదుపులోకి తీసుకున్నారు. ప్రకాశం జిల్లా చెరువు మండలంలోని శతకోడు గ్రామంలో పోలింగ్ నిలిచిపోయింది. డబ్బులు తీసుకున్న ఓటర్ల

- (మిగతా వివరాలు 4లో)

## హింస.. పోలీస్ వైఫల్యమే

అమరావతి (చైతన్యరథం): పల్నాడులో హింసాత్మక ఘటనలపై టీడీపీ అధినేత చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. మాచర్లలో ఇప్పటికీ దాడులు జరగడం పోలీసుల వైఫల్యమేనంటూ, పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. ఉదయం నుంచి పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేస్తున్నా, పోలీసుల దృష్టికి తీసుకొచ్చినా శాంతిభద్రతలు కాపాడలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ వెంటనే పోలింగ్‌ను సమీక్షించి పరిస్థితిని చక్కదిద్దాలని చంద్రబాబు కోరారు.

### ఏపీలో శాంతిభద్రతలు విఫలం: ఈసీకి తెదేపా ఫిర్యాదు

ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్లో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని తెలుగుదేశం పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈమేరకు తెదేపా అధినేత చంద్రబాబు రాసిన లేఖతోపాటు మరో 11 ఫిర్యాదులను మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ ఈసీకి అందజేశారు. ఉదయం నుంచి రాష్ట్రంలో 120కి పైగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చైతన్యరథం

# దాడులు.. కిడ్నాప్‌లు

# పెట్రోలు బాంబులు!!



నరసరావుపేటలో గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

(3వ పేజీ తరువాయి)

ఓట్లు తామే వేస్తామంటూ వైకాపా కార్యకర్తలు పోలింగ్ కేంద్రానికి వచ్చారు. దీనికి తెదేపా నేతలు అడ్డుచెప్పడంతో ఘర్షణ తలెత్తింది. మరోవైపు దర్శి మండలం పెద్ద ఓబినపల్లి గ్రామంలో తెదేపా ఏజెంట్లను బయటకు పంపి అధికారులు పోలింగ్ నిర్వహించారు. దీంతో పోలింగ్ నిలిపివేసి, రీపోలింగ్ జరపాలని తెదేపా ఏజెంట్లు నిరసనకు దిగారు.

### వైసీపీ అభ్యర్థి చెంప చెళ్లుమంది!

గుంటూరు జిల్లా తెనాలిలో.. ఓటేసేందుకు లైన్లో రావాలని చెప్పినందుకు ఓటరుపై వైకాపా అభ్యర్థి శివకుమార్ చేయి చేసుకున్నారు. అభ్యర్థినన్న అహంభావంతో శివకుమార్ నేరుగా వెళ్తుండటంపై ఓటరు నిలదీశాడు. ఆగ్రహించిన శివకుమార్ అతడిపై దాడికి దిగడంతో, సహనం కోల్పోయిన ఓటరు సైతం శివకుమార్ చెంప చెళ్లుమనిపించాడు. దాంతో శివకుమార్ అనుచరులు ఓటరుపై విచక్షణారహితంగా దాడి చేశారు. అక్కడున్న పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. ఘటనపై ఓటర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే, తెనాలి ఐతానగర్ పోలింగ్ బూత్ వద్ద పరిస్థితిని సీసీ కెమెరాల ద్వారా పరిశీలించిన సెంట్రల్ స్పెషల్ పోలీస్ అబ్జర్వర్, హింసాత్మక ఘటనలు జరిగిన 5 ప్రాంతాల్లోని పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు.

### కార్లతో వెంబడించి..

విజయవాడ తెదేపా అభ్యర్థి కేశినేని చిన్ని బృందంపై వైకాపా మూకలు రాళ్లదాడికి పాల్పడ్డాయి. చిన్ని అనుచరులను వైకాపా నాయకులు, కార్యకర్తలు అసభ్యపదజాలంతో దూషించారు. వాళ్లుదాడి చేస్తున్నా పోలీసులు పట్టించుకోలేదని తెదేపా ఆరోపిస్తోంది. పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం దొండపాడులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. తెదేపా ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులు వాహనాలపై వైకాపా కార్యకర్తలు దాడి చేసి.. మూడు వాహనాలను ధ్వంసం చేశారు.

### పెనమలూరులో బీభత్సం..

కృష్ణాజిల్లా పెనమలూరు మండలం నిడమానూరు హైస్కూల్ వద్ద పోలింగ్ కేంద్రంలో తెదేపా వర్గానికి చెందిన వీర్ల రాజేష్, షరీఫ్‌పై వైకాపా అభ్యర్థి జోగి రమేశ్ తన అనుచరులతో దాడి చేశారు. అనంతరం తెదేపా వర్గీయుల ఇళ్ల ముందు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. మరో వైపు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు జోగి రమేశ్ భారీగా తన అనుచరులను తరలించి దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారు. తెదేపా శ్రేణులు ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం వరకు ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. నిడమానూరు పోలింగ్ కేంద్రం వద్ద వైకాపా దాడిలో గాయపడిన వారిని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోడే ప్రసాద్ పరామర్శించారు. ఓటమి భయంతో మంత్రి జోగి రమేశ్, అతని కుమారుడు రాజీవ్ పోలింగ్ బూత్‌ల వద్ద అనుచరులతో అలజడి సృష్టిస్తున్నారని బోడే ప్రసాద్ ఆరోపించారు.

### స్వతంత్ర అభ్యర్థిపై దాడి

డోన్ నియోజవర్గంలోని బేతంచెర్లలో స్వతంత్ర అభ్యర్థి పిఎస్ బాబుపై వైకాపా వర్గీయులు దాడికి పాల్పడ్డారు. బుగ్గన రాజేంద్రనాథ్ కారువెనుక వెళ్తున్న పిఎస్ బాబు కారు అద్దాలను ధ్వంసం చేశారు. తమవెంట రావొద్దంటూ పరుష పదజాలంతో హెచ్చరించారు. ఆగ్రహం వ్యక్తం చేసిన పిఎస్ బాబు బేతంచర్ల పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గంలోని ఖాజీపేట మండలం పుల్లూరులో తెదేపా కార్యకర్తలపై వైకాపా నేతలు దాడికి పాల్పడ్డారు. దాడిలో గూడెం చెన్నయ్య అనే కార్యకర్త తీవ్రంగా గాయపడ్డారు. అస్పత్రికి తరలించి అతడికి చికిత్స అందిస్తున్నారు. వైకాపా నాయకుడు నాగేశ్వర రెడ్డి దాడి చేసినట్టు బాధితులు తెలిపారు.

కృష్ణా జిల్లా గుడివాడలో అర్ధరాత్రి కొడాలి నాని అనుచరుల హల్‌చల్ చేశారు. నాగవరప్పాడులో టిక్ పెట్టుకున్న కొంతమందికే డబ్బులు ఇవ్వడంతో స్థానికులు ప్రశ్నించారు. నాని అనుచర వర్గం ప్రజలపై దాడికి దిగడంతో, జనం ఎదురు తిరిగారు. దాంతో అక్కడి నుంచి నాని అనుచరులు నిష్క్రమించారు. అలాగే, అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం పాపక్కగారిపల్లె 201వ కేంద్రంలో వైసీపీ, టీడీపీ ఏజెంట్‌పై దాడికి దిగింది. టీడీపీ ఏజెంట్ వాహనం ధ్వంసం చేసి ఏజెంట్ ఫారాలు లాక్కెళ్లారు. సుభాష్ అనే టీడీపీ ఏజెంట్‌ను కిడ్నాప్ చేసి, తెదేపా ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు లాగేశారు. కడప జిల్లా కమలాపురం మండలం కోకటంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ ఏజెంట్ల నియామకంపై ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తి, తెదేపా వైసీపీలు పరస్పరం రాళ్లురువ్వుకున్నారు.

అనంతపురం జిల్లా ఉరవకొండ 129వ పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నేతల దౌర్జన్యం - పోలింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగిన వైసీపీ నాయకులు - నిన్న సాయంత్రమే ఏజెంట్ పాసులు తీసుకోవాలని కోరిన అధికారులు - నిబంధనలు పెట్టినా పాసులకు దరఖాస్తు చేయని వైసీపీ ఏజెంట్లు - ఇవాళ నేరుగా పోలింగ్ కేంద్రానికి వచ్చి పాసులు ఇవ్వాలన్న వైసీపీ నేతలు - పాసులు ఇచ్చేందుకు నిరాకరించిన పోలింగ్ అధికారులు - పోలింగ్ అధికారులతో వైసీపీ నాయకులు వాగ్వాదం

మాచర్ల నియోజకవర్గంలో కంభంపాడులో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం చేసుకుంది. వైసీపీ శ్రేణులు గొడ్డళ్లు, వేటకొడవళ్లు, రాడ్లతో రహదారి పైకి వచ్చి భీభత్సం సృష్టించారు. దీంతో కంభంపాటులో భారీగా పోలీసులు మోహరించారు. ఐజీ శ్రీకాంత్ పరిస్థితిని పర్యవేక్షించారు. చంద్రగిరి బ్రహ్మణ కాలువ 380 బూత్‌లో టీడీపీ-వైసీపీ మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు కేంద్ర బలగాలు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది.

### ఈవీఎంల ధ్వంసం

రాజంపేట నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలు భయానక వాతావరణం సృష్టించాయి. దళవాయిపల్లెలో టీడీపీ ఏజెంట్లపై వైసీపీ శ్రేణుల దాడి చేసిన ఘటనలో దళవాయిపల్లెలో ఈవీఎం ధ్వంసమైంది. మాచర్లలో వైసీపీ మూకలు రెచ్చిపోయిన ఉదంతంలో 216, 205, 206, 207, పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు ధ్వంసమయ్యాయి. పోలింగ్ నిలిపివేసి సిబ్బంది బయటకు పరుగులు తీయాల్సి వచ్చింది.

### గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి రోశయ్యపై ప్రజల తిరుగుబాటు

గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి రోశయ్యపై ప్రజలు తిరుగుబాటు చేశారు. పొన్నూరు నియోజకవర్గం పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన ఎస్సీ మహిళ పట్ల రోశయ్య దురుసుగా ప్రవర్తించారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గానికి ఏం చేశారని మహిళలు ప్రశ్నించగా... మహిళలపై రోశయ్య ఆవేశంతో ఊగిపోయారు. తన అనుచరులకు చెప్పి పశ్నించిన మహిళలపై దాడి చేయాలని సూచించడంతో అక్కడున్న మహిళలు తీవ్రంగా ప్రతిఘటించారు. మహిళలపైకి రోశయ్య కారుతో దూసుకెళ్లే ప్రయత్నం చేయగా... అక్కడున్న వారంతా ఏకంకావడంతో రోశయ్య పరారైయారు.

### హింసపై ఈసీ సీరియస్

అమరావతి (చైతన్యరథం): గుంటూరు జిల్లా తెనాలి, పల్నాడు జిల్లా మాచర్ల, అనంతపురంలో జరిగిన సంఘటలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. దాడులకు పాల్పడిన వారిపై గృహనిర్బంధంతో పాటు కేసులు పెట్టాలని ఈసీ ఆదేశించింది. పుంగనూరులో నిందితులను వదిలేసిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సాయంత్రం 4-6 గంటల మధ్య ఎలాంటి ఘటనలు జరిగినా చర్యలు తీవ్రంగా ఉంటాయని పోలీస్ శాఖకు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది.

### కుప్పంలో వైసీపీ అభ్యర్థి భరత్ బెదిరింపులు

కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలోని పలు కేంద్రాల్లో వైసీపీ బెదిరింపులకు పాల్పడింది. కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలోని పలు కేంద్రాల్లోకి వైసీపీ అభ్యర్థి భరత్ పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి టీడీపీ ఏజెంట్లను బెదిరించారు. ననియాల పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. సింగసముద్రంలోని పోలింగ్ బూత్‌కు వెళ్లి తలుపు మూసిన వైసీపీ అభ్యర్థి భరత్...ఎదురుతిరిగి మూసిన తలుపులను తెరిచిన టీడీపీ కార్యకర్తలు.

## దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తాం

### కర్నూలు డీఐజీ విజయరావు స్పష్టీకరణ

కడప (చైతన్య రథం): వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పోలింగ్ కేంద్రాన్ని కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "కర్నూలు, కడప జిల్లాలో కొన్ని చెదురుమదురు ఘటనలు జరిగాయి. మైదుకూరులో తెదేపా ఏజెంట్లపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తాం. పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర, రాష్ట్ర బలగాలు మోహరించాయి. కడప జిల్లాలో జరిగిన గొడవలపై ఆ జిల్లా ఎస్పీ పరిశీలిస్తున్నారు. తప్పు ఎవరు చేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బలగాలు మోహరించినా కొన్ని చోట్ల గొడవలు జరిగాయి. క్యూలైన్లలో జరిగిన గొడవల్లో పోలీసుల తప్పిదం ఉందని తేలితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం. దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం. ప్రజలందరూ పోలీసులకు సహకరించాలి" అని డీఐజీ విజ్ఞప్తి చేశారు.



చైతన్యరథం

# ఫలించిన చంద్రబాబు వ్యూహం!

- కూటమితో రాష్ట్ర పునర్నిర్మాణానికి పొందిన మోదీ హామీ
- జగన్‌రెడ్డి ఎన్నికల కుట్రలకు అడ్డుకట్ట



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ముగిసిన ఎన్నికల కోసం తెదేపా, భాజపా, జనసేనలతో కూటమి ఏర్పాటుకు చంద్రబాబు చూపిన చొరవ, చేసిన కృషి పట్ల కొన్నివర్గాల్లో మొదట్లో కొన్ని సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ కూటమి ఏర్పాటు సంకల్పం వెనుక తెదేపా అధినేత చంద్రబాబు ప్రధానమైన ఆలోచన... కేంద్రంలో మూడోసారి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కావడం తథ్యమని, జగన్‌రెడ్డి పాలనతో విధ్వంసానికి గురైన నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి మోదీ ప్రభుత్వం సహకారం అత్యవసరమని. దీనికి జగన్ వ్యతిరేక ఓటు ఎట్టి పరిస్థితుల్లో చీలకూడదన్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పట్టుదల తోడైంది. దీంతో రాష్ట్రంలో ఈ మూడు పార్టీలతో కూడిన కూటమి ఏర్పడింది.

## బెంబేలెత్తిన జగన్‌రెడ్డి

నిన్న ముగిసిన ఎన్నికలకు దాదాపు రెండేళ్ల ముందునుంచే జగన్‌రెడ్డి వ్యతిరేక ఓట్ల చీలికను నివారించే విషయంపై పవన్‌కళ్యాణ్ మాట్లాడారు. దీని పర్యవసానాలను గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రతిపక్షాల పొత్తుకు వ్యతిరేకంగా గళం విప్పారు. తెదేపా, జనసేన పార్టీలతో భారతీయ జనతాపార్టీ కూడా కలిసే అవకాశం కనిపించినప్పటినుంచి జగన్‌రెడ్డి ఇంకా బెంబేలెత్తి రాజకీయ దిగజారుడుతనాన్ని ప్రదర్శించారు.

ఈ మూడు పార్టీల కూటమి ఏర్పాటును ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వ్యతిరేకించడానికి ప్రధాన కారణాలను రాజకీయ పరిశీలకులు విశ్లేషించారు. తన ప్రభుత్వం పట్ల ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న వ్యతిరేకత దృష్ట్యా ఎట్టి పరిస్థితుల్లోను అధికారాన్ని మరోసారి చేజిక్కించుకోవడానికి జగన్‌రెడ్డి ఎటువంటి నీచానికైనా దిగజారుతాడని వారు ముందే చెప్పారు. ఇందులో భాగంగా పోలింగ్ రోజున పలుచోట్ల హింసను రేకెత్తించి ప్రజల్లో భయాన్ని కల్పించి ప్రతిపక్ష ఓటర్లను తమ ఇళ్లకే పరిమితం చేయాలనేది జగన్‌రెడ్డి ప్రధాన కుట్ర అని పరిశీలకులు వ్యాఖ్యానించారు. తన కనుసన్నల్లో నడిచే ఐఏయస్, ఐపీయస్ అధికారుల సహాయంతో స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు జరగకుండా చూడాలనేది జగన్‌రెడ్డి క్షేత్రస్థాయి వ్యూహం. దీనికి అండగా కేంద్ర ప్రభుత్వంతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయన్న ప్రజాభిప్రాయాన్ని ఆసరాగా చేసుకుని ఉన్నతాధికారులను తన రాజకీయ స్వార్థం కోసం వాడుకోవాలనేది ముఖ్యమంత్రి వ్యూహం.

కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రతిపక్ష కూటమిలో చేరితే ఎన్నికల సమయంలో తన ఆటలు సాగవని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి భయం. దీంతో భాజపాను కూటమిలో చేరకుండా చేయడానికి అన్ని ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు.

## జగన్‌కు షాక్ మీద షాక్‌లు

మార్చి 16న ఎన్నికల ప్రకటన వచ్చి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా ఎన్నికల సంఘం అధీనంలోకి వచ్చింది. అప్పటినుంచి శాంతి భద్రతలు, పరిపాలనకు సంబంధించిన పలు నిర్వాకాలను కూటమి నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తరచుగా తీసుకెళ్లారు. ముఖ్యంగా పలువురు ఉన్నత పోలీసు అధికారులు ముఖ్యమంత్రి ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించడంపై వారు ధ్వజమెత్తారు. కూటమి ఎన్నికల ప్రచార సభ కోసం మొదటిసారిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిలకలూరిపేట ప్రజాగళం సభలో పాల్గొన్నప్పుడు ఉన్నత పోలీసు అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యం బయటపడిరది. దీనిని తీవ్రంగా పరిగణించిన ఎన్నికల సంఘం సంబంధిత ఉన్నతాధికారులపై బదిలీ వేటు వేసి జగన్‌రెడ్డికి మొదటి షాక్ ఇచ్చింది. తరువాత పలు విడతల్లో మరికొంత మంది పోలీసు అధికారులపై బదిలీ వేటు వేసింది. దీంతో ఇక తన పాచికలు పారవని తెలుసుకున్న జగన్‌రెడ్డి రాష్ట్రంలో ఎన్నికలు సరిగా జరుగుతాయన్న నమ్మకం లేదని వ్యాఖ్యానించి తన అంతర్యాన్ని, బేలతనాన్ని, ఓటమి భయాన్ని బయటపెట్టుకున్నారు.

## కూటమే లేకుంటే...

సోమవారం జరిగిన పోలింగ్ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో 7 గంటలకు ముందే ఓటర్లు బూత్‌ల వద్ద బారులు తీరారు. దీంతో కలవరపడిన జగన్ మూకలు మాచర్ల, పుంగనూరులలో హింసకు తెరతీసి క్రమంగా దాన్ని విస్తరించే ప్రయత్నం చేశారు. ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలతో నియమ నిబంధనలకు వ్యతిరేకంగా జగన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటే తరువాత తీవ్ర పరిణామాలు తప్పవని గుర్తించిన పోలీసు అధికారులు చాలావరకు స్వతంత్రంగా వ్యవహరించారు. పోలింగ్ సరళిని నిరంతరం సమీక్షిస్తూ అవాంఛనీయ ఘటనలను సంబంధిత పోలీసు అధికారుల దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లడంతో వారు ఇంకా అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో వైసీపీ మూకల ఆగడాలు మాచర్ల, పుంగనూరు వంటి 10 నియోజకవర్గాలకే పరిమితమయ్యాయి. భాజపాతో కూడిన కూటమి ఏర్పడకుంటే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తన దుష్ట పన్నాగాలను పూర్తిస్థాయిలో అమలుచేసి ఎన్నికల సరళిని తనకు అనుకూలంగా మార్చుకునే వాడని... కూటమి ఏర్పాటుతో చంద్రబాబు దానికి అడ్డుకట్ట వేయగలిగారని, దీంతో ఆయన వ్యూహం పూర్తిగా ఫలించిందని రాజకీయ పరిశీలకుల ఏకాభిప్రాయం.

## ఓటమి భయంతో వైసీపీ దౌర్జన్యాలు, అరాచకాలు

- ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఆగ్రహం



అమరావతి(చైతన్యరథం): ఓడిపోతున్నామనే భయంతో వైసీపీ నాయకులకు దిక్కు తోచని స్థితిలో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మండిపడ్డారు. పోలింగ్ సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనలపై ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమండ్ చేశారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైసీపీ నాయకులు ప్రజల్ని పీక్కుతిన్నారన్నారు. ప్రజలు వ్యతిరేకంగా ఓటు వేస్తున్నారని అర్థమై ఫ్రస్టేషన్‌లో పోలింగ్ కేంద్రాల దగ్గర టీడీపీ ఏజెంట్లపై దాడులు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ముగ్గురు ఏజెంట్లను కిడ్నాప్ చేశారు. కృష్ణా జిల్లా గుడివాడలో కొడాలి నాని అనుచరులు రౌడీలకే రౌడీలన్నట్లు హల్‌చల్ చేశారు. ఓటర్ల ఇళ్ల తలుపులు బాది, అందరూ వైసీపీకే ఓటు వేయాలని భయభ్రాంతులకు గురి చేశారు. మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ దౌర్జన్యాలు, అరాచకాలకు అంతేలేదు. రెంటచింతలలో టీడీపీ ఏజెంట్లపై వైసీపీ శ్రేణులు జరిపిన దాడిలో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. నలుగురు ఏజెంట్లు గాయపడ్డారు. పార్వతీపురంలో ఏకంగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. వీటిపై ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని అనురాధ డిమాండ్ చేశారు.

# జనం కసితో ఓటేశారు

- ఊహించని ఫలితాలు చూస్తాం
- టీడీపీ అధినేత చంద్రబాబు ఉద్ఘాటన



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర భవిష్యత్ కోసం జనం ఒక కసితో ఓటు వేశారని, ఈ సారి ఊహించని ఫలితాలు చూడబోతున్నామని టీడీపీ అధినేత చంద్రబాబు ఉద్ఘాటించారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల కోసం సోమవారం ఉదయం 7 గంటల నుంచే మొదలైన పోలింగ్ సాయంత్రం 6గంటలకు ముగిసింది. 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల కోసం ఈ ఎన్నికలు జరిగాయి. పలు నియోజకవర్గాల్లో కీలక నేతల మధ్య గట్టి పోటీ కొనసాగింది. ఈ నేపథ్యంలో మీడియాతో చంద్రబాబు చిట్‌చాట్ చేశారు. ఈసారి ఊహించని ఫలితాలు చూడబోతున్నామని ఉద్ఘాటించారు. ప్రజా స్ఫూర్తితో వైసీపీ కుట్రలు ఎక్కడికక్కడ భగ్నం చేశామన్నారు. ఓటమి భయంతో అధికార వైసీపీ నేతలు ఎన్నికల వేళా కుట్రలు పన్నుతూ వచ్చారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కసి ప్రతీ ఓటర్‌లోనూ కనిపించిందన్నారు. వైసీపీ నేతలు ఓటమి భయంతో హింసకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు.

పుంగనూరులో ఏజెంట్ల కిడ్నప్‌తో మొదలుపెట్టి, మాచర్ల, తాడిపత్రి, నరసారావుపేట, గురజాల, పెనమలూరు ఇలా రాష్ట్ర వ్యాప్తంగా హింసను ప్రేరేపించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారని .. కానీ తెలుగుదేశం శ్రేణులు ఎక్కడికక్కడ దీటుగా ఎదుర్కోవటంతో వారి ఆటలు సాగలేదని చంద్రబాబు పేర్కొన్నారు. కాగా.. సోమవారం రోజంగా పార్టీ జాతీయ కార్యాలయం నుంచి పోలింగ్ సరళిని పర్యవేక్షించిన చంద్రబాబు రాత్రి 8 గంటల సమయంలో ఉండవల్లి నివాసానికి బయలుదేరగా.. సీఎం సీఎం అంటూ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలింగ్ సరళి పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, అందరితో ఆనందం పంచుకుంటూ చంద్రబాబు ఇంటికి బయలుదేరారు.

## రాక్షసుల్ని తరిమేందుకు ప్రజలు మహాయుద్ధం చేశారు

ఓటర్ల చొరవతో ప్రజాస్వామ్యం పరిఢవిల్లిందన్న వర్ల రామయ్య

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో రాక్షస పరిపాలనకు స్వస్తి పలికేందుకు, అరాచక పాలన అంతం కోసం, దుర్మార్గ పాలకుడిని రాష్ట్రం నుండి తరిమికొట్టేందుకు, అప్రజాస్వామిక, రాజ్యాంగాన్ని ఏమాత్రం గౌరవించని పాలకుడిని ఓడించడం కోసం రాష్ట్రంలో ఓటర్లు మహాయజ్ఞం చేపట్టారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు.

రాష్ట్రంలో తానే తిరిగి అధికారంలోకి రావాలి, తన అరాచకాలను కొనసాగించాలని జగన్ రెడ్డి చేసిన ప్రయత్నాలను తిప్పికొడుతూ ఓటర్లంతా హీరోలుగా నిలబడ్డారన్నారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వర్ల రామయ్య మాట్లాడుతూ అరాచక వాదిని రాష్ట్రం నుండి తరిమికొట్టేందుకు తెల్లవారుజాము నుండే జనం క్యూలైన్లలో నిలబడ్డారన్నారు. ఓటమి తథ్యమని తెలిసి వైసీపీ మూకలు.. అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు, పోలింగ్ బూతుల్లో విధ్వంసం, రిగ్గింగుకు తెరలేపారు. ఎంతగా తెగించి కుట్రలకు పాల్పడినా.. వారి ఆటలు సాగలేదు. అరాచక వాదుల్ని తరిమికొట్టే యుద్ధంలో ప్రజలంతా భాగస్వాములుగా నిలిచినందుకు ధన్యవాదాలు. రాష్ట్రంలో ఇంతగా అరాచకాలు జరుగుతున్నా చీఫ్ సెక్రటరీ ఏం చేస్తున్నారు. ఎందుకు పోలింగ్‌బూత్‌ల్లో కరెంటు కోతల విషయంలో చర్యలు తీసుకోలేదో సమాధానం చెప్పాలని వర్ల డిమాండ్ చేశారు.

## రాష్ట్రప్రజల తెగువకు పాదాభివందనం!

అరాచకశక్తులకు ఎదురొడ్డి ఓట్ల ఉప్పెన తెచ్చారని లోకేష్ అభినందనలు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో ప్రజాతీర్పును తారుమారు చేసేందుకు అధికారపార్టీ చేసిన అన్ని ప్రయత్నాలను తిప్పికొడుతూ పోలింగ్ కేంద్రాలవద్ద ఓట్లతో తిరుగుబాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అభినందనలు తెలియజేశారు. తెల్లవారుజాము నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు ఓటుహక్కు వినియోగించుకునేందుకు బారులు తీరడం వెల్లివిరిసిన ప్రజాచైతన్యానికి నిదర్శనమన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం అరాచకశక్తులకు ఎదురొడ్డి రాష్ట్ర ప్రజలు చూపిన తెగువ చరిత్ర పుటల్లో నిలచిపోతుందని కొనియాడారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఉప్పెనలా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చిన ఓటరు దేవుళ్లకు పాదాభివందనాలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా శ్రమించిన నాయకులు, కార్యకర్తలందరికీ లోకేష్ ధన్యవాదాలు తెలిపారు.

చైతన్యరథం

# చీఫ్ కమాండర్ చంద్రబాబు

- పోలింగ్ సరళిపై అనుక్షణం అప్రమత్తం.. నిరంతర సమీక్ష
- ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులపై సూచనలు
- సేనకు సూచనలు, సలహాలు, దిశానిర్దేశం
- రోజంతా పార్టీ వార్ రూమ్‌లో గడిపిన అధినేత

అమరావతి (చైతన్యరథం): కీలకమైన పోలింగ్ రోజున తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు రోజంతా ఆత్మకూరులోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గడిపారు. ఓటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి జరిగిన పరిణామాలను నిరంతరం సమీక్షించి ఎప్పటికప్పుడు తగిన ఆదేశాలిస్తూ యుద్ధ క్షేత్రంలో తెదేపా అభ్యర్థులు, నాయకులు శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

వాతావరణ పరిస్థితులు, కూటమి తరపున పోలింగ్ ఏజెంట్ల నియామకం, ఓటింగ్ సరళి, ఓటమి భయంతో వైసీపీ మూకల అగడాలను ఎప్పటికప్పుడు విచారిస్తూ, తగిన సూచనలిస్తూ ఎన్నికల కురుక్షేత్రంలో తన సేనలను చీఫ్ కమాండర్‌గా ముందుకు నడిపించారు.

ఉదయం ఉండవల్లిలో కుటుంబసభ్యులతో కలిసి ఓటువేసిన వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయంలోని వార్ రూమ్‌కు చేరుకుని పోలింగ్ పూర్తయ్యేవరకు పరిస్థితులను సమీక్షించారు. భారతీయ జనతా పార్టీ, జనసేన నాయకులు కూడా రోజంతా చంద్రబాబు జరిపిన సమీక్షలో పాల్గొని తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఉదయం 7 గంటలకు ముందే గ్రామాలు, పట్టణాల్లో పోలింగ్ బూత్‌లవద్ద ఓటర్లు బారులు కట్టిన తీరుపై చంద్రబాబు హర్షం వ్యక్తం చేస్తూ ఇది మంచి శుభ సూచనకమని... రోజంతా ఈ సరళి కొనసాగేలా చూడాలని అభ్యర్థులకు, నాయకులకు సూచించారు.

పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే వైసీపీ రౌడీ మూకలు మాచర్ల, పుంగనూరు నియోజకవర్గాల్లో హింసకు పాల్పడడంతో అక్కడి పార్టీ అభ్యర్థులతో వెంటనే మాట్లాడి వారికి ధైర్యాన్నిచ్చారు. మాచర్ల తెదేపా అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డితో మాట్లాడుతూ.. వైసీపీ కుట్రలను ముందుగానే ఊహించామని, జగన్‌రెడ్డి మూకలు పాల్పడే ప్రతి హింసాత్మక సంఘటన వారి ఓటమి సంతకమని వారిని ధైర్యంతో ఢీకొనాలని చెప్పారు.

ఆయా ప్రాంతాల పోలీసు ఉన్నతాధికారుల తోనూ మాట్లాడి నిష్పాక్షికతతో వ్యవహరించి శాంతిభద్రతలను కాపాడాలని, పోలింగ్‌పై ఎట్టి పరిస్థితుల్లో వ్యతిరేక ప్రభావం పడకుండా చూడాలని సూచించారు. పలువురు ఇతర అభ్యర్థులతో మాట్లాడి ఎప్పటికప్పుడు పరిస్థితుల గురించి వాకబు చేశారు.

పార్టీ ఏర్పాటు చేసిన సాంకేతిక వ్యవస్థ సహాయంతో పోలింగ్ సరళిని నిరంతరం సమీక్షిస్తూ... పోలింగ్ తక్కువగా ఉన్న చోట్ల దానికి కారణాల గురించి స్థానిక నాయకులతో వాకబు చేసి పోలింగ్‌ను పెంచడానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

పార్టీ లీగల్ టీమ్‌తో కూడా నిరంతరం చర్చిస్తూ వైసీపీ మూకల అగడాలకు సంబంధించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయడం, తగు పరిష్కార మార్గాలను కనుగొనాల్సిన ఆవశ్యకతను వివరించి... దురుద్దేశపూర్వకంగా వైసీపీ మూకలు పాల్పడే హింసాత్మక ఘటనలతో భయపడవద్దని ఓటర్లకు ధైర్యం చెప్పారు. ఈ విధంగా కీలకమైన పోలింగ్ రోజున అనుక్షణం యుద్ధ క్షేత్రంలో పోరాడిన అభ్యర్థులు, కూటమి నాయకులు, శ్రేణులకు అండగా ఉండి ముందుకు నడిపించారు. పోలింగ్ రోజైన సోమవారమంతా తెదేపా వార్‌రూమ్‌లో చంద్రబాబు ఎంతో హుషారుగా, కూటమి భారీ విజయంపట్ల పూర్తి విశ్వాసంతో ఉన్నారని, నిన్న జరిగిన ఓటింగ్ సరళి ఆయన విశ్వాసాన్ని నిలుపుతుందని కూటమి నాయకులు వ్యాఖ్యానించారు.

# పోలింగ్ 80 శాతం పైనే!

- రికార్డు స్థాయిలో నమోదు కానున్న పోలింగ్
- క్రమేణా పెరిగిన ఓటింగ్
- సాయంత్రం ఆరు తర్వాత కూడా బూతుల వద్ద భారీ క్యూలు
- భారీ పోలింగ్ జరిగిందన్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి
- అధికారిక సమాచారం నేడు వెల్లడి



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజిలంలో రాత్రి 7 గంటలు దాటినా పోలింగ్ కేంద్రం వద్ద ఓటేసేందుకు వేచిచూస్తున్న ఓటర్లు

అమరావతి, చైతన్యరథం: ఐదేళ్ల జగన్ రెడ్డి అరాచక పాలనకు నిరసనగా సోమ వారం నాడు జరిగిన పోలింగ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రల రాజకీయ చరిత్ర లో ఒక కొత్తరికార్డు సృష్టించనుంది. సోమ వారం నాడు జరిగిన పోలింగ్ సరళిని బట్టి ఈ ఎన్నికల్లో పోలింగ్ ఎట్టి పరిస్థితుల్లోనూ 80శాతం దాటుతుందని ఎన్నికల విశ్లేష కుల అభిప్రాయం. నిర్ణీత పోలింగ్ సమ యానికి కంటే ముందుగానే రాష్ట్ర వ్యాప్తం గా పలుచోట్ల చైతన్య వంతులైన ఓటర్లు బారులు తీరినా కొన్ని కారణాల వలన మొదట్లో పోలింగ్ మందగమనంతో సాగి నా క్రమేణా పుంజుకొని రికార్డు నెలకొల్ప నుంది. తీవ్రమైన ఎండ, కొన్ని చోట్ల వర్షా లు పడినా మార్పు కోసం ప్రజాస్పందన భారీగా వ్యక్తమయింది.

విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు నిన్న ఉదయం ఏడు గంటలకు ప్రారంభ మైన పోలింగ్ 11.30 గంటలకు 27 శాతంగా రికార్డయింది. మధ్యాహ్నం 12 గంటలకు 34 శాతంగాను, ఒంటి గంటకు 42 శాతం నమోదయ్యింది. సాయంత్రం నాలుగు గంటలకు 64శాతం ఓటర్లు తమ ఓటు హక్కు విని యోగించుకోగా, ఐదు గంటలకు 68 శాతం, ఏడు గంటలకు 76 శాతానికి చేరింది.

పోలింగ్ ముగింపునకు నిర్ణీత సమయ మైన సాయంత్రం ఆరు గంటలకు కూడా పలుచోట్ల వందలాది ఓటర్లు బారులు తీరి ఉన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ ముగింపు సమయానికి క్యూలో ఉన్న ఓటర్లందరికీ ఓట్లేసే అవకా శం కల్పించాల్సి ఉంటుంది. దీంతోపాటు పోస్టల్ బ్యాలెట్లు, సీనియర్ సిటిజన్ల ఓట్లు లెక్కలోకి తీసుకుంటే ఈ ఎన్నికల్లో పోలింగ్ 80 శాతం దాటి కొత్త రికార్డు ఏర్పడుతుం దని పరిశీలకుల ధృఢ విశ్వాసం.

నిన్నటి పోలింగ్‌కు కొద్దిరోజుల ముం దు ఈ ఎన్నికల్లో 83శాతం పోలింగ్‌ను లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధానఅధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలి పారు. సోమవారం నాడు నిర్ణీత పోలింగ్ సమయం ముగిసాక పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో భారీ పోలింగ్ జరిగిందని,దీనికి సంబంధించి తుది సమా చారాన్ని మంగళవారం నాడు వెల్లడిస్తా మని ఆయన చెప్పారు.

కేంద్ర ఎన్నికల సంఘం సమాచారం మేరకు నిన్న సాయంత్రం ఐదుగంటల వర కు రాష్ట్రంలోని 26జిల్లాల్లో అల్లూరి జిల్లా లో కనిష్టంగా 55.17శాతం,చిత్తూరు జిల్లా లో గరిష్ఠంగా 74.06శాతం పోలింగ్ జరి గింది.జిల్లాలవారీగా పోలింగ్ సమాచారం.



విశాఖలోని మారికవలసలో రాత్రి 8 గంటల సమయంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వేచిచూస్తున్న ఓటర్లు






రాష్ట్ర ప్రజలకు ఎక్స్‌లో చంద్రబాబు కృతజ్ఞతలు

**సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ శాతం వివరాలు**

| | |
|---|---|
| శ్రీకాకుళం | 67.48 |
| పార్వతీపురం | 61.18 |
| విజయనగరం | 68.16 |
| విశాఖపట్నం | 57.42 |
| అనకాపల్లి | 65.97 |
| అల్లూరి | 55.17 |
| కాకినాడ | 65.01 |
| కోనసీమ | 73.55 |
| తూ.గోదావరి | 67.93 |
| ఏలూరు | 71.10 |
| ప.గోదావరి | 68.98 |
| కృష్ణా | 73.3 |
| ఎన్టీఆర్ | 67.44 |
| గుంటూరు | 65.58 |
| పల్నాడు | 69.10 |
| బాపట్ల | 72.14 |
| ప్రకాశం | 71 |
| నెల్లూరు | 69.95 |
| చిత్తూరు | 74.06 |
| తిరుపతి | 65.88 |
| అన్నమయ్య | 67.63 |
| వైఎస్సార్ | 72.85 |
| అనంతపురం | 68.04 |
| సత్యసాయి | 67.16 |
| నంద్యాల | 71.43 |
| కర్నూల్ | 64.55 |

# కొత్త చరిత్రకు ఇది శ్రీకారం

### ఒకే సంకల్పంతో ఓటేసిన ప్రజలకు చంద్రబాబు ధన్యవాదాలు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో సోమవారం జరిగిన పోలింగ్ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఎన్నికల చరిత్రలో ఇది ఒక ప్రత్యేకమైన రోజు. ఓటు వేయడానికి ప్రజలు చూపించిన ఉత్సాహం, వారిలో వెల్లివిరిసిన చైతన్యం చూసాక కొత్త చరిత్రకు ఇది శ్రీకారం అనిపించింది. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ప్రతి ఓటరులోనూ అరాచకానికి ముగింపు పలికి ప్రజాస్వామ్య పాలన సాధించుకోవాలనే కసి స్పష్టంగా కనిపించింది. ఒకే రకమైన సంకల్పంతో ఓటు వేయడానికి వందల, వేల కిలోమీటర్ల దూరం నుంచి ప్రజలు వచ్చారు. ఆర్థిక భారాన్ని, ఎండ వేడిమిని, ప్రయాణ కష్టాన్ని ఓర్చుకుని రాష్ట్రం కోసం పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చిన ప్రతి ఓటరుకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

ఓటమి భయంతో భయోత్పాతం సృష్టించి పోలింగ్‌ను తగ్గించడానికి వైసీపీ నేతలు హింసకు పాల్పడినా ఎక్కడా వెనక్కి తగ్గని ఓటరు ధైర్యానికి వందనం. ఇప్పటి వరకు ఉన్న పరిస్థితులు చూస్తే 80 శాతానికి పైగా పోలింగ్ నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది శుభసూచకం. రాష్ట్ర ప్రయోజనాల కోసం కూటమిగా కలిసివచ్చిన మూడు పార్టీలను అర్థం చేసుకుని ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు. రాష్ట్రానికి ఇకపై అన్నీ మంచి రోజులే. ఏపీ ప్రజల స్ఫూర్తికి మరోమారు ధన్యవాదాలు..

# సీఎం జగన్, మంత్రి విడదల రజనీపై కేసు నమోదు



అమరావతి: ఎన్నికల నియమావళి ఉల్లంఘించినందుకు సీఎం జగన్, గుంటూరు పశ్చిమ వైసీపీ అభ్యర్థి, మంత్రి విడదల రజనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోసారి అధికారంలోకి రావాలని వైఎస్ జగన్‌రెడ్డి అడ్డదారులు తొక్కారు. సోమవారం ఉదయం పోలింగ్ ప్రారంభమైన తర్వాత కూడా సీఎం జగన్ , మంత్రి విడుదల రజనీ పేరుతో ఓటర్లకు ఐవీఆర్‌ఎస్ ఫోన్లు వచ్చాయి. జగన్, విడదల రజనీ పేరుతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన వైసీపీకి ఓటు వేయాలని ఐవీఆర్‌ఎస్ ఫోన్ కాల్స్ వచ్చాయి. దీనిపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నేతలు దేవినేని ఉమ, పంచుమర్తి అనురాధ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఐవీఆర్‌ఎస్ వాయిస్ ఉన్న పెన్ డ్రైవ్‌ను కూడా ఎన్నికల కమిషన్‌కు టీడీపీ నేతలు అందజేశారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఓటర్లు కూడా ఫిర్యాదు చేశారు. వీటిని పరిశీలించిన ఎన్నికల సంఘం.. పోలింగ్ ప్రారంభమైన తర్వాత ఐవీఆర్‌ఎస్ కాల్స్ రావడాన్ని సీరియస్‌గా తీసుకుంది. వీరిద్దరిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. ఈసీ ఆదేశాల మేరకు జగన్, రజనిపై మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం నెంబర్ 249/24 కింద కేసు నమోదు చేశారు.

# సజ్జలలో ఓటమి భయం

## వాస్తవాలను దాచేసి ఈసీపై నిందలేస్తున్నారని దేవినేని ధ్వజం

- ఓటింగ్‌కు వచ్చిన జనసునామీతో కళ్లు బైర్లు కమ్మాయి
- హిట్లర్‌కు పట్టిన గతే జగన్‌కూ..
- ఓటింగ్‌కు భారీగా తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- భారీ మెజారిటీతో ఎన్డీఏ ప్రభుత్వం వస్తుంది, ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తుంది



అమరావతి(చైతన్యరథం): పోలింగ్ కేంద్రాల వద్ద జన సునామీని చూసి తట్టుకోలేక ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అసత్యాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేవినేని ఉమా మాట్లాడుతూ...నిర్దేశిత సమయం ముగిసినా కూడా 3,500 బూత్‌ల్లో ఓటేసేందుకు జనం బారులు తీరి ఉండటమే కూటమి విజయానికి సంకేతమన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పట్టుదల, అంకిత భావంతో దేశ, విదేశాల నుండి భారీ ఎత్తున ఓటర్లు తరలివచ్చారు. తెల్లవారుజామునుంచే బారులు తీరిన ఓటర్లను చూసి సజ్జల రామకృష్ణారెడ్డి కళ్లు బైర్లు కమ్మాయి. ఓటమి భయం సజ్జల రెడ్డి ముఖంలో స్పష్టంగా కనపడుతోంది. బేలగా ఎన్నికల సంఘం మీద నిందలు వేస్తున్నారు. అధికారుల బదిలీలపై బురద జల్లుతున్నారు. కౌంటింగ్ ఏజెంట్లను నిలబెట్టుకోవడానికి బడాయి కబుర్లు చెబుతున్నారు. జగన్ రెడ్డి, సజ్జల రెడ్డి, విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి దుకాణాలు ఇక మూసేసేకోవడమే. ఇప్పటికి కూడా ప్రజలను మభ్య పెట్టాలని సజ్జల రెడ్డి అబద్దాలు మాట్లాడుతున్నారు. ఉదయాన్నే చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి నియోజకవర్గంలోని బోరగమంద గ్రామంలో టీడీపీ ఏజెంట్లను అపహరించారు. ఈ విషయంలో సజ్జల రెడ్డి మాటలు విన్నందుకు స్థానిక ఎస్సై సస్పెండ్ అయ్యారు. మాచర్లలో అధికార వైసీపీ నేతలు ఎన్నో దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలు చేశారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలంలో టీడీపీ ఏజెట్లపై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. కడప జిల్లా దాపాదు మండలంలో టీడీపీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రం నుంచి బయటలాగేశారు. శ్రీశైలం 4,5 పోలింగ్ కేంద్రాల్లో, ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు చేసిన అరాచకాలు సజ్జలకు కనపడలేదా. దాచేపల్లిలో పోలింగ్ బూత్‌ల వద్ద వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలపై చేసిన దాడులు, ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం మాగల్లు, సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలంలో, మైదుకూరు నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకల దాడులు సజ్జలకు కనిపించలేదా. పయ్యావుల కేశవ్ స్వగ్రామంలో వైసీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడటంతో పాటు, వైసీపీ అభర్థి విశ్వేశ్వర్ రెడ్డి పోలింగ్ ప్రక్రియను కూడా నిలిపివేయించాడు. గ్రామాన్ని అభివృద్ధి చేయలేదంటూ నెల్లూరు జిల్లా కమ్మవారిపాలెం గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. అలాంటిది నిస్సిగ్గుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని సజ్జల చెప్పుకుంటున్నారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం పాపక్కగారిపల్లెలో టీడీపీ ఏజెంట్ పై ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డి అనుచరులు దాడి చేశారు. మాచర్ల నియోజకవర్గంలో కంభంపాడులో గొడ్డళ్లు, వేటకొడవళ్లు, రాడ్లతో వైసీపీ మూకలు రహదారి పైకి వచ్చి హల్ చల్ చేశారు. విజయవాడలో వైసీపీ కనుసన్నల్లో నడుచుకుంటూ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారు. నరసరావుపేటలో భారీ కాన్వాయితో పోలింగ్ కేంద్రాల సందర్శిస్తున పేరిట వైసీపీ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి దుర్మార్గాలు చేశాడు. తాడిపత్రిలో పెద్దారెడ్డి చేసిన దౌర్జన్యాలకు గృహ నిర్బంధం చేయాల్సి వచ్చింది. దర్శి మండలంలో 5 పోలింగ్ బూత్‌ల్లో దౌర్జన్యాలు చేసి సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి, మా ఏజెంట్లను బయటకు పంపించి వైసీపీ నాయకులు రిగ్గింగ్ చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన మా అభ్యర్థి లక్ష్మి, ఆమె భర్తపై దాడికి దిగారు. ఆ ఐదు బూత్‌లలో రీపోలింగ్ కావాలని దర్శి ఎస్పీ, కలెక్టర్‌కు మా అభ్యర్థి లక్ష్మి ఫిర్యాదు చేశారు. రేపు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి కూడా దీనిపై ఫిర్యాదు చేస్తాం. తెనాలిలో వైకాపా ఎమ్మెల్యే శివ కుమార్ చేసిన అరాచకం రాష్ట్రం మొత్తం చూసింది. క్యూ లైన్‌లో వెళ్లమన్నందుకు ఐటి ఉద్యోగి అయిన ఓటర్‌పై దుర్మార్గంగా దాడి చేశారు. సదరు ఎమ్మెల్యేను ఆ ఓటరు కొట్టిన దెబ్బ వైసీపీ అరాచకానికి, తాడేపల్లి ప్యాలెస్ కుట్రలు, కుతంత్రాలకు తగిలిన చెంప దెబ్బ. తిరువూరు నియోజకవర్గం కంభంపాడులో ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని బృందంపై వైసీపీ మూకలు దాడి చేశారు. నరసరావుపేట టీడీపీ ఎంపి అభ్యర్థి కృష్ణదేవరాయరాయలు కారుతో పాటు మరో 3 కార్లపై దాడి చేశారు. గన్నవరం నియోజకవర్గం కొత్తమల్లపల్లిలో అళ్ల గోపాలకృష్ణపై వైసీపీ మూక దాడి చేసి, చొక్కా చించి, కారు అద్దాలు పగులగొట్టారు. చిలకలూరిపేట నియోజకవర్గం గంగన్నపాలెంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు కర్రలతో దాడి చేశారు. డోన్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిపై కూడా దాడులు చేసే హీన పరిస్థితుల్లో వైసీపీ ఉంది. తాడిపత్రిలో ఎస్పీ కారునే వైసీపీ మూకలు దాడి చేశారంటే ఎంతలా వారికి పిచ్చెక్కిందో అర్థమవుతోంది. ఇలాంటివి సుమారు 120 సంఘటనలపై సీఈవోకు ఫిర్యాదు చేశాం. వాటిని కప్పిపుచ్చుకోవటానికి ఈసీపై నిందలు వేస్తున్నారు. చరిత్రలో హిట్లర్‌కు ఏ గతి పట్టిందో అదే గతి జగన్ రెడ్డికి పట్టబోతుంది. ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత ఏ విధంగా ఉందో ఓటింగ్ సరళిని చూస్తే తెలుస్తోంది. మండుటెండలు సైతం లెక్కచేయకుండా మహిళలు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. వారందికీ చేతులెత్తి నమస్కారం చేస్తున్నాం. ఓటు పోయింది, తీసేశారు వంటి ఆందోళనలు ఈసారి తగ్గాయి. ఓటర్ లిస్ట్‌లో జగన్ రెడ్డి చేసిన దుర్మార్గాలను పసిగట్టి ఎన్డీఏ కార్యకర్తల కృషితో అడ్డుకున్నాం. వాస్తవాలకు విరుద్ధంగా సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి మాట్లాడుతున్నారు. వైసీపీ నాయకులు చేసిన నేరాలు, దాడులను కప్పిపుచ్చుకోవడానికి ఆ నిందలు మా కార్యకర్తలపై వేస్తున్నారు. ఇక మీ అబద్ధాలను నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరు. 2019లో కంటే రికార్డు స్థాయిలో ఈ సారి ఓటింగ్ శాతం పెరగనుంది. అత్యధిక సీట్లతో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రానుంది. జగన్ రెడ్డి కూడా ఓడిపోతున్నాడని తెలిసి లండన్ పారిపోవడానికి పథకం వేసుకున్నాడు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాబోతున్నారు. ఆయనిచ్చిన వాగ్దానాలు అమరావతి, పోలవరం వంటి అన్నీ ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు సంక్షేమాన్ని కూడా అందించనున్నారు.

---

# వైసీపీ వాషవుట్!!

- జన సునామీలో జగన్ ఉక్కిరిబిక్కిరి
- ప్రజలు మీట నొక్కారు... 'బిడ్డ' బుడగ పేలింది
- మూడు ప్రాంతాల్లోనూ మాడు పగిలింది
- హింసతో పోలింగ్ తగ్గించాలని పన్నాగం
- పారని నియంత నికృష్ట పాచికలు
- రాయలసీమలోనూ తిరుగుబాటు సంకేతాలు

అమరావతి (చైతన్య రథం): ఒక సామాన్యుడు సామంత రాజులాంటి ఎమ్మెల్యే చెంప పగలగొట్టడం దేనికి సంకేతం? సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సందర్భంగా తెనాలిలో రికార్డయిన దృశ్యం దేశవ్యాప్తంగా సంచలన కథనమైంది. 'అధికార పార్టీ ఎమ్మెల్యేనన్న కండకావరంతో ఓటరుపై చేయి చేసుకున్న అన్నాబత్తుని శివకుమార్, జీవితంలో మరచిపోలేని గుణపాఠాన్ని నేర్చుకున్నారు. తనపై దాడి చేసిన ఎమ్మెల్యేకు, ఏమాత్రం సంకోచం లేకుండా అదే భాషలో బదులిచ్చిన పౌరుడి సందేశం ఏమిటి? ఆ చెంపదెబ్బ భౌతికంగా ఎమ్మెల్యేకి తగిలినా... అధికార పార్టీ మొత్తానికి గూబ గుయ్యిమంది. ఎమ్మెల్యేకు జరిగిన 'సత్కారం' జగన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో వచ్చిన తిరుగుబాటుకు తిరుగులేని సంకేతం. ఈ తరహా ప్రజాస్పందన తెనాలికి మాత్రమే పరిమితం కాలేదు. గన్నవరంనుంచి అనంతపురం వరకు అధికార పార్టీ నేతలపై ఎదురుదాడికి ప్రజలు సిద్ధపడ్డారు. గన్నవరం ఎమ్మెల్యేను పరుగులు పెట్టించారు. నర్సరావుపేట ఎమ్మెల్యేకు ప్రతిదాడి అంటే ఏమిటో రుచిచూపించారు. కేవలం ఓట్లతోనే కాక... చేతులతోనూ అధికార పార్టీ నేతలకు బుద్ధి చెప్పారు. హింసతో పోలింగ్ శాతాన్ని తగ్గించాలన్న జగన్‌రెడ్డి కుతంత్రాన్ని తిప్పికొట్టి, పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు ప్రజలు.

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో గత ఎన్నికలకుమించి భారీగా పోలింగ్ నమోదవుతోంది. 2014తో పోలిస్తే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ సుమారు 6 శాతం పెరిగింది. అప్పుడు అధికార పార్టీ ఓడిపోయిన విషయం తెలిసిందే. అప్పుడు వరద వచ్చిందనుకుంటే ఇప్పుడు ఏకంగా సునామీ అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్‌ని చుట్టుముట్టింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 74.68 శాతం పోలింగ్ నమోదైతే, 2019లో అది 80.61 శాతానికి పెరిగింది. ఈ ఎన్నికల్లో అంతకుమించి నమోదవుతుందని ఎన్నికల కమిషన్ అంచనా. సోమవారం సాయంత్రం 5 గంటల సమయానికి రాష్ట్రంలో సగటున 68 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఆరు గంటల సమయానికి మరింత పెరిగింది. అప్పటికీ 3,500 పోలింగ్ కేంద్రాల్లో భారీ క్యూలు ఉన్నాయి. ఒక్కోచోట 100 నుంచి 300 వరకు ఓటర్లు క్యూలలో ఉన్నట్టు ఎన్నికల కమిషన్ అధికారులు ప్రకటించారు. రాత్రి బాగా పొద్దుపోయేవరకు పోలింగ్ జరిగింది. గత ఎన్నికల్లోనే రికార్డుస్థాయిలో పోలింగ్ జరిగిందనుకుంటే... ఇప్పుడా రికార్డు బద్దలవుతోంది.

ఓటర్లు పోటెత్తడమంటే అర్థం ఏమిటి? అధికార పార్టీకి మూడిందన్న మాట. రాష్ట్రం నలుమూలల నుంచీ వస్తున్న సమాచారం ప్రకారం... ఆ ప్రాంతం, ఈ ప్రాంతం అన్న తేడాలేకుండా అన్నిచోట్లా జగన్‌రెడ్డికి జెల్ల కొట్టారు జనం. ఇందుకు జగన్‌రెడ్డి కంచుకోటగా భావించే రాయలసీమా మినహాయింపు కాదు. కొద్దిగా ఎక్కువా తక్కువా అన్నదే ప్రశ్న. మూడు రాజధానుల పేరిట జగన్‌రెడ్డి వికృత క్రీడను ఆరంభిస్తే... మూడు ప్రాంతాల - ఉత్తరాంధ్ర, కోస్తా ఆంధ్ర, రాయలసీమ- ప్రజలూ వ్యతిరేక ఓటుతో ముగింపు పలికారు. మూకుమ్మడిగా మాడు పగలగొట్టారు. ముఖ్యంగా గ్రీన్‌ఫీల్డ్ రాజధాని అమరావతి నగరాన్ని ధ్వంసం చేసి మధ్య కోస్తా ప్రాంతంపై కక్షపూరితంగా వ్యవహరించిన జగన్‌రెడ్డిపై ఈ ప్రాంత ప్రజలు కన్నెర్ర చేశారు. దీన్ని ముందే పసిగట్టిన జగన్‌రెడ్డి రాజధాని ప్రాంతమున్న ఉమ్మడి గుంటూరు జిల్లాలో తీవ్రస్థాయిలో హింసను ప్రేరేపించాడు.

పల్నాడులో అనేకచోట్ల రక్తం చిందింది. గురజాలలో బాంబుదాడులకు దిగారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని తొండపి గ్రామంలో రాళ్ల దాడి చేశారు. మాచర్ల మరో యుద్ధభూమి అయింది. నర్సరావుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆగడాలపై ఆగ్రహించిన జనం అతని ఇంటిపైకే దండెత్తారు. పల్నాటి పౌరుషం చూపించారు. పల్నాడు నుంచి రాయలసీమ వరకు ఫ్యాక్షన్ తరహా దాడులకు పాల్పడిన జగన్‌రెడ్డి గ్యాంగులను ప్రతిపక్ష నేతలు సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ప్రజలు తిప్పికొట్టారు.

ఎన్నికలు నిర్వహించేది కేంద్ర ఎన్నికల సంఘమే అయినా... కొందరు పోలీసు అధికారులు ఎన్నికల రోజున కూడా జగన్‌రెడ్డికి ఊడిగం చేశారు. ఫలితంగానే గొడవలు రేపినవారిని కాకుండా ప్రతిపక్ష పార్టీల నేతలపైనే జులుం చేశారు. ఏంచేసినా... జగన్‌రెడ్డి గుంటనక్క తెలివి పారలేదు. జగన్‌రెడ్డి పార్టీ అభ్యర్థులు జన సునామీ ధాటికి తుడిచిపెట్టుకుపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

అత్యధిక శాతం కూటమి అభ్యర్థులు 50 శాతం కంటే ఎక్కువ ఓట్లతో అధికార పార్టీ ఎమ్మెల్యేలను మట్టి కరిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓటింగ్ తగ్గించాలని ప్రయత్నించాడంటేనే జగన్‌రెడ్డి పతనం ఖాయమైందని అర్థం. 'అన్న'వల్ల జరిగిన ఓ మంచి పరిణామం ఏమంటే... గతంలో ఓటు వేయడానికి ఆసక్తి చూపించనివాళ్లు కూడా ఎక్కడెక్కడి నుంచో వచ్చి కసిగా మీట నొక్కారు. 'మీ బిడ్డను నేను' అని ఎంత ఊదరగొట్టినా ప్రజలు నమ్మలేదు. నిండా గాలి కొట్టి జగన్‌రెడ్డి వదిలిన బెలూన్లు పేలిపోయాయి.

రాష్ట్రంలో పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం జరుగుతోందని జగన్‌రెడ్డి ఓ మిథ్యావాదాన్ని లేవనెత్తాడు. తనను పేదల రక్షకుడుగా, ప్రత్యర్థులను పెత్తందారులుగా అభివర్ణించాడు. ఘర్షణను సృష్టించే ప్రయత్నం చేశాడు. అయితే, 'అన్న' కోరుకున్నది జరగలేదు. కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా... పేదలు, మధ్య తరగతి, ఎగువ తరగతి అనే తేడా లేకుండా ఒకేవిధంగా తీర్పు చెప్పారు. ఈ ఎన్నిక ఓ క్రూరమైన పాలెగాడిని సాగనంపే యజ్ఞంగా ప్రజలు భావించారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రానికి మంచి జరగలేదని జనం తమ ఓట్ల ద్వారా బదులిచ్చారు.

చెల్లి ఛీకొట్టింది... తల్లి తిరస్కరించింది. నీచ రాజకీయాలు, నికృష్ట వ్యక్తిత్వంతో ప్రజలకే కాదు... సొంత మనుషులకూ దూరమైన పాలకుడు జగన్‌రెడ్డి. సొంత జిల్లా సొంత పార్లమెంటు నియోకజవర్గంలో జగన్‌రెడ్డి పార్టీకి ఓటు వేయవద్దని స్వయాన అతని తల్లి చెప్పిందంటే... సిగ్గున్నవాడెవడైనా కుళ్లి చస్తాడు. అవేమీలేని 'అన్న'... తన ఒంటరిపాటుకు కూడా ప్రత్యర్థులనే నిందించాడు.

తానొక్కడిపై అంతా కలసి పోరాడుతున్నారని, అది తన వీరత్వమని వాక్రువ్వాడీ వాగాడంబరుడు. బాబాయి హత్యతో భ్రష్టు పట్టి, చెల్లి- తల్లి తిరస్కారంతో పాతాళానికి దిగజారిన జగన్‌రెడ్డి వ్యక్తిగత ప్రతిష్ఠ ఓవైపు... వాగ్దాన భంగాలు, వైఫల్యాలు, వంచనతో కూడిన నిరంకుశ పాలన మరోవైపు... ప్రజలను ఆలోచింపజేసింది. వాగ్దాన భంగాలు, వైఫల్యాలు, వంచనను ఎంతకాలం భరిస్తారు? 'బటన్' నొక్కడం మాత్రమే తన పని అని చాటుకున్న జగన్‌రెడ్డిని ఇంటికి పంపడానికి ప్రజలు ఐదేళ్లు వేచి చూసి ఒకే ఒక్క బటన్ నొక్కారు. అంతే... జగన్‌రెడ్డి ఎక్కడి నుంచి వచ్చాడో అక్కడికే పోయి పడబోతున్నాడు.

చైతన్యరథం

# పరాజయం తప్పదనే పేట్రేగిన వైసీపీ మూకలు

- పలు ప్రాంతాల్లో దాడులు, దౌర్జన్యాలు
- చర్యలు తీసుకోవాలని సీఈఓకు మాజీమంత్రి దేవినేని ఫిర్యాదు

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వైసీపీ నేతలు పోలింగ్‌కు విఘాతల కల్పించేందుకు కుట్ర ప్రకారం హింసకు, విధ్వంసాలకు పాల్పడుతున్నారని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హింసకు పాల్పడిన వైసీపీ మూకలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నిక అధికారి(సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనాకు దేవినేని వేరువేరుగా లేఖలు రాశారు.

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం, రెంట చింతల మండలం రెంటాల గ్రామంలో టీడీపీ ఏజంట్లు, కార్యకర్తలపై వైసీపీ నేతలు దాడి చేశారు. ఓటమి భయంతో హింసకు వైసీపీ పాల్పడుతోంది.

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో వైసీపీ అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం భార్య వాణిశ్రీ తన అనుచరులతో కలిసి 158, 159 నెంబర్ పోలింగ్ బూత్‌లను ఆక్రమించి ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారు. పోలింగ్ బూత్‌ల నుంచి టీడీపీ సానుభూతిపరులను బయటకు పంపివేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్ సతీమణి ఇలా పోలింగ్ బూత్‌లు ఆక్రమించి రిగ్గింగుకు పాల్పడటం దారుణం.

నరసరావుపేట అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పరిమితికి మించి ఎక్కువ సంఖ్యలో అనుచరులు, వాహనాలతో నియోజకవర్గంలో తిరిగారు. సెక్షన్ 144 అమలు చేయడంలో పోలీసులు వైఫల్యం చెందారు. చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడినం దుకుగాను గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. నరసారావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలుకు చెందిన మూడు కార్లను వైసీపీ కార్యకర్తలు ధ్వసం చేసి, టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు.

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలు పోలింగ్‌కు విఘాతం కలిగించారు. నియోజకవర్గంలోని ఆంధ్ర లయోలా కాలేజీ, జియాన్ స్కూలు పోలింగ్ స్టేషన్లలో వైసీపీ కార్యకర్తలు ఓటర్లను భయభ్రాతులకు గురిచేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నా పోలీసులు చోద్యం చూస్తూ ఊరుకున్నారు. పోలీసులు వైకాపా కార్యకర్తలను అదుపులోకి తీసుకోకపోగా, అడ్డుకోబోయిన టిడిపి కార్యకర్త పూర్ణను అరెస్టు చేశారు. వైసీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ ప్రోద్బలంతో



కొంతమంది పోలీసు అధికారులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు.

దర్శి నియోజకవర్గంలోని బొట్లపాలెం, యెర్రబోయినపల్లె, తుమ్మపాడు గ్రామాల్లో వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడ్డారు. పోలింగ్ కేంద్రాలను తమ ఆధీనంలోకి తీసుకొని ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఇంత జరుగుతున్నా పోలీసులు చేష్టలుడిగి చూస్తుండిపోయారు.

తెనాలి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నబత్తుని శివకుమార్ అనుచరులతో కలిసి గుంపుగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడాన్ని ప్రశ్నించిన ఓటర్‌పై అనుచరులతో కలిసి దాడి చేశారు. నన్నే ప్రశ్నిస్తావా అంటూ సాధారణ ఓటర్‌పై చేయిచేసుకున్నారు. సెక్షన్ 144ను అమలు చేయడంలో పోలీసులు విఫలమయ్యారు. ఈ ఘటనను ప్రత్యేక కేసుగా పరిగణించి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిపై శివకుమార్, అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలి

యర్రగొండపాలెం నియోజకవర్గం, సత్తకోడూరు, గంగవరం గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. సత్తకోడూరులో వైసీపీ కార్యకర్తల కారణంగా పోలింగ్ నిలిచిపోయింది.

శ్రీకాకుళం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ నియోజకవర్గంలోని పోలింగ్‌బూత్‌లను సందర్శిస్తుండగా వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. వైసీపీ గూండాలను అదుపు చేయడంలో పోలీసులు వైఫల్యం చెందారు. పోలీసుల వైఫల్యంతో టీడీపీ అభ్యర్థి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేయాల్సి వచ్చింది. గొండు శంకర్‌పై జరిగిన దాడి ఘటనపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఆదేశించండి. ఎమ్మెల్యే అభ్యర్థికే రక్షణకల్పించకుండా వివక్షపూరితంగా వ్యవ హరించిన పోలీసు అధికారులపై విచారణచేసి చర్యలు

## పోలీసులకూ రక్షణ లేదా?

**అస్మిత్ రెడ్డిపై దాడి వైసీపీ అరాచకాలకు పరాకాష్ట: చంద్రబాబు**

అమరావతి(చైతన్యరథం): తాడిపత్రిలో పోలింగ్ సందర్భంగా హింస చోటుచేసుకోవడం పట్ల టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. పోలింగ్‌లో వైసీపీ హింస ఎంతవరకు వెళ్లిందంటే...కనీసం పోలీసులకు కూడా రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. తాడిపత్రిలో ఏకంగా ఎస్పీ వాహనంపైనే దాడి చేయడం, తాడిపత్రి టీడీపీ అభ్యర్థి అస్మిత్‌రెడ్డిపై దాడికి దిగడం వైసీపీ హింసా రాజకీయాలకు పరాకాష్ట అని ధ్వజమెత్తారు. జగన్ ఐదేళ్లుగా పెంచి పోషించిన రౌడీ మూకలు ఈ రోజు తమ దాడుల ద్వారా ప్రజల్లో భయం పుట్టించి పోలింగ్ శాతాన్ని తగ్గించడం ద్వారా లబ్ది పొందే కుట్ర చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. ప్రజలు ఈ కుట్రలను తిప్పి కొడతారని, అత్యధిక ఓటు శాతంతో వైసీపీ హింసా రాజకీయానికి ముగింపు పలుకుతారని ఉద్ఘాటించారు. ఈ మేరకు తాడిపత్రి ఘటనల తాలూకు వీడియోను కూడా పంచుకున్నారు.

### జగన్ కోరలు పీకే సమయం వచ్చింది: లోకేష్

ప్రజాస్వామ్య పండుగైన ఓటింగ్ రోజు కూడా తాడిపత్రిలో వైసీపీ మారణహోమం చూసి ఆవేదన కలుగుతోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. టీడీపీకి అనుకూలంగా ఓటింగ్ జరుగుతోందని పోలీసులను కూడా కొడుతున్న వీళ్లా మన నేతలని ప్రశ్నించారు. ఇలాంటి ఫ్యాక్షన్ పోకడలను పెంచి పోషిస్తున్న జగన్ కోరలు పీకే సమయం వచ్చింది. మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ఈ అల్లరి మూకలను రాష్ట్ర పొలిమేరల వరకు తరిమికొడతామని లోకేష్ హెచ్చరించారు.

### ఓటరుపై వైసీపీ ఎమ్మెల్యే దాడి నిస్పృహకు నిదర్శనం: చంద్రబాబు

అమరావతి(చైతన్యరథం): పోలింగ్ కేంద్రంలో ఓటరుపై వైసీపీ ఎమ్మెల్యే దాడి చేయటం వైసీపీలో నెలకొన్న ఫ్రస్ట్రేషన్‌కు నిదర్శనమని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. ఓటమి ఖాయమవటంతో వైసీపీ ఎమ్మెల్యేల విచక్షణ కోల్పోయి ప్రజలపై దాడి చేస్తున్నారు. ప్రజల్లో వచ్చిన చైతనాన్ని, తిరుగుబాటును దాడులతో అణిచివేయలేరు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం దాష్టీకాలపై ప్రజలు ఓటు రూపంలో తిరుగుబాటు చేస్తున్నారని ఎక్స్‌లో చంద్రబాబు పేర్కొన్నారు.

### పోలింగ్‌కు పోటెత్తిన ఎన్నారై టీడీపీ నేతలు!

అమరావతి(చైతన్యరథం): తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అమెరికాతో పాటు పలు దేశాలలో నివసిస్తున్న ప్రవాసాంధ్రులు, ఎన్నారై టీడీపీ నేతలు ఏపీకి భారీ సంఖ్యలో తరలివచ్చారు. వారంతా తమ తమ స్వస్థలాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నారై టీడీపీ మీడియా కోఆర్డినేటర్ సాగర్ దొడ్డపనేని తన ఓటు హక్కును ఎన్టీఆర్ జిల్లా నందిగామలో వేశారు. ముఖ్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతుగా టీడీపీ ఎన్నారై నేతలు పోలింగ్ రోజున ఓటు వేయడమే కాకుండా టీడీపీ కూటమిని గెలిపించాలని, చంద్రబాబును మరోసారి ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఓటర్లను చైతన్యపరుస్తూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

## ప్రజాతీర్పును హైజాక్ చేసేందుకు వైసీపీ కుట్రలు



- బెదిరించి, భయపెట్టి ప్రజలు పోలింగ్ బూత్‌కు రాకుండా కుట్రలు
- ఓటర్లపైనే దాడులకు తెగబడడం వైసీపీ నేతల అసహనానికి నిదర్శనం
- దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, రక్తపాతంతో ప్రజాతీర్పును మార్చలేరు
- సీఎం పేషీ అధికారి ధనుంజయ్‌రెడ్డి కలెక్టర్లకు ఆదేశాలివ్వడంపై ఈసీ స్పందించాలి
- పోలింగ్ బూత్‌ల వద్ద వైసీపీ నేతల అరాచకాలపై ఎన్డీఏ కూటమి నేతల ధ్వజం

అమరావతి(చైతన్యరథం): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఎంతో ఉత్సాహకరంగా జరుగుతున్న తరుణంలో పోలింగ్ శాతానికి విఘాతం కలిపించేందుకు వైసీపీ నేతలు కుట్ర పూరితంగా వ్యవహరించారని ఎన్డీఏ కూటమి నేతలు విమర్శించారు. ప్రజాస్వామ్య పండుగ జరుపుకునేందుకు తెల్లవారుజాము నుండే ఉత్సాహంగా ఓట్లు వేయడానికి పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరిన జనాన్ని చూస్తే వారు ఎలాంటి మార్పు కోరుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్ అన్నారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో సోమవారం ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో షరీఫ్ మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమికి ఓటేసి రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించడానికి ప్రజలు సిద్ధమయ్యారన్నారు.ప్రజల్లో వచ్చిన ఈ మార్పు తిరుగుబాటుకు నిదర్శనంగా కనిపిస్తోంది. ప్రజల ఉత్సాహం, పోలింగ్ జరిగిన సరళి చూసి వైసీపీ నాయకుల వెన్నులో వణుకు మొదలైంది. అందుకే అల్లరి మూకలు దాడులకు దిగారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారారు. కూటమి అభ్యర్థులపై, మీడియాపై, పోలీసులపై, మహిళలపై దాడులకు తెగబడ్డారు. ఓటమి భయంతో దాడులతో, అక్రమాలకు పాల్పడాలని ప్రయత్నించారు. మాచర్లలో వైసీపీ నేతలు తొలి నుండి ఫ్యాక్షన్ రాజకీయాన్ని ప్రేరేపిస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని ప్రయత్నిస్తున్న టీడీపీ అభ్యర్థి జూల కంటి బ్రహ్మారెడ్డిపై దాడులకు తెగబడ్డారు. అతని కారును ధ్వంసం చేశారు. రిగ్గింగ్ చేయడానికి వీల్లేకుండా ప్రజాస్వామ్య బద్ధంగా పోలింగ్ నిర్వహిస్తున్న ఏజెంట్లపై దాడులు చేసి బయటకు తరిమేశారు. ఓటర్లు బూత్ వద్దకు రాకుండా బెదిరింపులకు దిగారు.నరసరావుపేటలో లావు శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు కార్లపై దాడులకు పాల్పడ్డారు. తాడిపత్రిలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి, అతని కుమారుడు ప్రత్యక్షంగా దాడులకు తెగబడ్డారు. గుంటూరు ఎంపీ అభ్యర్థి..మహిళలను కారుతో తొక్కించేందుకు ప్రయత్నించారు.చీరాలలో టీడీపీ అభ్యర్థి కొండయ్యపై దాడికి పాల్పడ్డారు. శ్రీకాకుళంలో ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌పై పోలింగ్ బూత్‌లోనే దాడి చేశారు. తిరువూరులో ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని కారును ధ్వంసం చేశారు. ప్రజా స్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలను సైతం హైజాక్ చేసేందుకు ప్రయత్నించారు. ప్రజాస్వామ్యాన్ని హరిస్తూ ఎవరైనా తమ కాళ్లకిందే ఉండాలనేలా వ్యవహరిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద భయానక పరిస్థితులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి. ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎక్క డెక్కడి నుండో వచ్చిన ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసేలా జగన్‌రెడ్డి ముఠా వ్యవహరించడం దుర్మార్గం.

### నైరాశ్యంతోనే అల్లర్లు: దినకర్

బీజేపీ అధికార ప్రతినిధి, లంకా దినకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి మరీ కూటమిని గెలిపించుకోవాలని ముందుకువచ్చారు. ఎంతో ఉత్సాహంతో యువత, మహిళలు వచ్చారు. మధ్యాహ్నానికే ఏకంగా 60శాతం వరకు పోలింగ్ పూర్తవడంతో.. వైసీపీ నేతలు ఘోర పరాజయం తప్పదనే నైరాశ్యంతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నించారు. ధర్మవరంలో బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌ను ఓడించే లక్ష్యంతోరిగ్గింగ్‌కు పాల్పడ్డారు. విజయవాడ పశ్చిమలో వైసీపీ అభ్యర్థి ఏకంగా పోలీసులపై వీరంగంసృష్టించారు. గుంటూరులో బీజేపీ నేత సునీల్‌పై వైసీపీ ఎమ్మెల్సీ అప్పిరెడ్డి దాడికిపాల్పడ్డారు.రాజమండ్రిలో పోలింగ్ బూత్‌ల వద్ద బ్లేడ్ బ్యాచ్‌ని రంగంలోకి దింపాడు. తాడిపత్రిలో ఎస్పీ వాహనంపై ఎమ్మెల్యే పెద్దారెడ్డి తెగబడ్డాడు. తెనాలిలో ఓటరుపై వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దాడికిపాల్పడ్డాడు.ముఖ్యమంత్రి పేషీలో ఓఎస్డీగా ఉన్న ధనుంజయ్‌రెడ్డి వైసీపీ నేతలకు మేలుచేసేలా వ్యవహరించాలంటూ కలెక్టర్లకు సూచనలిస్తున్నాడు. జగన్‌రెడ్డి ఎన్నికుట్రలు చేసినా, అరాచకాలకు పాల్పడినా రాష్ట్ర భవిష్యత్తుకోసం ఓటర్లు కదలివచ్చారని దినకర్ అన్నారు.

### అసహనంతోనే దాడులు: కేకే శరత్

జనసేన అధికార ప్రతినిధి, ప్రొఫెసర్ కేకే శరత్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును హరించేలా వైసీపీ నేతలు వ్యవహరించారన్నారు. ఓటమి ఖరారయిందనే అసహనంతో దుర్మార్గాలకు పాల్పడ్డారు. ఓటరుపై తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దాడి చేయడం హేయం. జగన్‌రెడ్డి అరాచకాల పట్ల ప్రజలు ఎంతలా విసిగిపోయారో పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరిన ప్రజలే నిదర్శనమన్నారు.

# ఓటు వినియోగించుకున్న ప్రముఖులు



హిందూపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న నందమూరి బాలకృష్ణ, వసుందరదేవి



టెక్కలిలో కుంటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



శ్రీకాకుళంలో ఓటు వేసిన అనంతరం సిరా గుర్తు చూపిస్తున్న కింజరాపు రామ్మోహన్‌నాయుడు కుటుంబ సభ్యులు



గుంటూరు పశ్చిమలో ఓటు వేసిన అనంతరం సిరా గుర్తు చూపెడుతున్న గళ్ళా మాధవీ



కడపలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఆర్ శ్రీనివాస్ రెడ్డి, మాధవిరెడ్డి



గుంటూరులో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు



తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో ఓటు హక్కు వినియోగించుకున్న గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్




విజయవాడలో సతీసమేతంగా ఓటు వేసిన మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న



ఓటు వేసి అనంతరం ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్



ఓటు వేసిన అనంతరం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్రయాదవ్



పులివెందులలో ఓటు వేసిన అనంతరం బీటెక్ రవి



తెనాలిలో ఓటు హక్కు వినియోగించుకున్న నాదెండ్ల మనోహర్



ఓటు వినియోగించుకున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



విజయనగరంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు



ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీ



ఓటు హక్కు వినియోగించుకున్న జీవీ ఆంజనేయులు

విజయవాడలో ఓటు వేసిన కేశినేని చిన్ని





ఓటు హక్కు వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి బొల్లా సుధీర్ రెడ్డి

ఓటు హక్కు వినియోగించుకున్న ఎన్వీ నాయుడు



# ఓటేసిన ప్రముఖులు..


తనయులతో కలిసి ఓటు వేసిన గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్


పలాసలో ఓటు వేసిన అనంతరం తన భర్త కలిసి సిరా గుర్తు చూపిస్తున్న గౌతు శిరీష


కొవ్వూరులో తన సతీమణితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి కే.ఎస్ జవహర్


అమలాపురంలో ఓటు హక్కు వేసిన టీడీపీ ఎంపీ అభ్యర్థి గంటి హరీష్


విజయనగరంలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన కూటమి అభ్యర్థి బేబినాయన



ఓటు హక్కు వినియోగించుకుంటున్న వేమిరెడ్డి దంపతులు


గొల్లపూడిలో తన ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు


ఓటు హక్కు వినియోగించుకున్న అతిథి విజయలక్ష్మీ గజపతి


అమలాపురంలో అయితాబత్తుల ఆనందరావు


ఓటు హక్కు వినియోగించుకుంటున్న ధూళిపాళ్ళ నరేంద్రకుమార్


ఓటు వేసిన అనంతరం సిరా చూపుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్


కుటుంబ సభ్యులు కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ మంత్రి ఆమర్‌నాథ్ రెడ్డి


ఓటు వేసిన అనంతరం సిరా చుక్కను చూపిస్తున్న బొండా ఉమా కుటుంబ సభ్యులు

### వైసీపీ మూకల

# దాడులు, దౌర్జన్యాలు



దర్శి మండలం బొట్లపాలెం గ్రామంలో వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త



పల్నాడు జిల్లా గొట్టిపాల మండలంలో వైసీపీ దాడిలో గాయపడిన టీడీపీ శ్రేణుల్ని ఆస్పత్రికి తరలిస్తున్న చిత్రం



పల్నాడు జిల్లా రెంటచింతల గ్రామంలో మహిళా పోలింగ్ ఏజెంట్‌పై వైసీపీ కార్యకర్తల దాడి



కడప జిల్లా చాపాడు మండలం చిన్న గోకులూరు గ్రామంలో వైసీపీ దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త



మైదుకూరు నియోజకవర్గం పుల్లూరులో వైసీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన టీడీపీ దళిత కార్యకర్త



ఆముదాలవలస మున్సిపాలిటీలోని కుద్దీరాం కాలనీలో వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త



అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం పాపక్కగారి పల్లెలో గాయపడిన టీడీపీ కార్యకర్త



రెంటచింతలలో టీడీపీ కార్యకర్తపై దాడి



ఓడిపోతున్నాం అనే భయంతో, జగన్ రెడ్డి ప్రజలని ఓట్లు కూడా వేయనివ్వటం లేదు. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం, పుల్లంపేట మండలం దల్లాయి పల్లె బూత్‌లో ఈవీఎం పగలుగొట్టిన వైసీపీ నేతలు



పల్నాడు రెంటచింతల మండలం జెట్టిపాలెం బూత్ నెం 215లో ఈవీఎంలను పగలగొట్టిన వైసీపీ కార్యకర్తలు



పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పరిధిలోని రెంటాల గ్రామంలో మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిపై వైసీపీ వర్గీయులు దాడి చేయడంతో ధ్వంసమైన వాహనం



సర్వేపల్లి నియోజకవర్గంలో స్వల్ప ఉద్రిక్తత, లాఠీఛార్జి



కర్నూలు జిల్లా మల్లేపల్లి గ్రామంలో గాయపడిన టీడీపీ కార్యకర్త

# వలస ఓటు.. రవాణా పోటు..!

- ♦ప్రైవేటు ట్రావెల్స్ దందా
- ♦ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండులు
- ♦చార్జీలకు భారీ మొత్తంలో ఖర్చు
- ♦ జాడలేని ఆర్టీసీ బస్సులు
- ♦అరగంటకు ఒక్క బస్సు కూడా లేదని జనం గగ్గోలు





విజయవాడ (చైతన్యరథం) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీ నేతలకు వలస ఓటర్ల రవాణా పోటు (ఖర్చు) దెబ్బ కూడా బాగానే తగిలింది. ఓట్ల కొనుగోలుతో పాటు ప్రయాణ ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు విజయవాడకు వచ్చారు. విజయవాడ నుంచి వివిధ జిల్లాలకు వెళ్లటం మాత్రం చాలా కష్టంగా మారింది. ఆర్టీసీ అధికారులు ఎలక్షన్ల సమయంలో తగినన్ని బస్సులు వేయకపోవటంతో ఉన్న అతి తక్కువ బస్సుల్లోనే ప్రయాణికులు కిక్కిరిసి ఊళ్లకు వెళ్లాల్సి వచ్చింది. సాధారణ సమయంలో తిరిగే బస్సులు కూడా లేకపోవడం ప్రయాణికులను ఇక్కట్లకు గురి చేసిందని వాపోతున్నారు. ఎండలో పడిగాపులు పడి ఆటోలు, కార్ల కోసం ఎదురు చూసి ఎక్కువ మొత్తం చెల్లించాల్సి తమ ప్రాంతాలకు వెళ్లవలసి వచ్చిందన్నారు.

అలాగే మరికొన్ని చోట్ల అంటే...కనిగిరి నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన ఎంతో మంది ప్రజలు ఇతర రాష్ట్రాల్లో, ఏపీలోని పలు ప్రాంతాల్లో వివిధ పనులు నిమిత్తం వలస జీవనం గడుపుతున్నారు. అలా దాదాపు 50వేల మందికి పైగానే ఉన్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వారందరూ ఓటు వేసేందుకు రావాలంటే ఒక్కొక్కరికి రూ.6వేల వరకు ఖర్చు అయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి కనిగిరికి ఏసీ బస్సుకు రూ.4200, నాన్ ఏసీ బస్సుకు రూ.2600 వసూలు చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో కనిగిరి ప్రాంతానికి చెందిన వారు హైదరాబాద్‌లో వేల సంఖ్యలో ఉన్నారు. ఎన్నికల్లో ఓటు వేసేందుకు శని, ఆదివారాల్లో కొందరు చేరుకోగా, సోమవారం చాలామంది వచ్చారు. ఎక్కువ మంది ముందుగానే రిజర్వేషన్ చేసుకున్నారు. ఆర్టీసీ బస్సులు లేకపోవడం వల్లే తీవ్రమైన ఇబ్బందులు ప్రజలు ఎదుర్కోవాల్సిన దుస్థితి వచ్చిందని ప్రయాణికులు మండిపడుతున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి చెబుతూనే ఇలా బస్సులు లేకుండా చేయడం అధికారపార్టీ ప్రజలను ఇబ్బంది పెట్టడం కాదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ప్రైవేట్ ట్రావెల్స్ బాదుడు

ఆర్టీసీ సంస్థ ఎన్నికల నిర్వహణకు బస్సులను పూర్తిస్థాయిలో వినియోగించలేదు. దూర ప్రాంతాల నుంచి రాకపోకలకు ప్రైవేట్ ట్రావెల్ బస్సులే దిక్కయ్యాయి. ఇదే అదునుగా వారు డిమాండ్‌ను బట్టి ఇష్టాను సారంగా టికెట్ రేట్లు పెంచేశారు. తమ స్వగ్రామాల్లో ఎన్నికల పండుగకు వచ్చేందుకు వలస ఓటర్లు ఉత్సాహం చూపారు. నియోజకవర్గానికి చెందిన అనేకమంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తెలంగాణ జిల్లాల్లో సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్ వంటి ఉద్యోగాల్లో ఉండటంతో పాటు వివిధ పనులు, వ్యాపారాల్లోనూ ఉన్నారు. వలస ఓటర్లకు పోటీలో ఉన్న ఆయా పార్టీల అభ్యర్థులు వచ్చి ఓటు వేసేందుకు నగదును ముందుగానే ఆన్‌లైన్ ద్వారా వారి ఖాతాల్లో జమచేశారు. దీంతో చాలామంది కనిగిరి ప్రాంతానికి కార్లు, ప్రైవేటు వాహనాలు, ట్రావెల్ బస్సులలో చేరుకోవటంతో నగర పంచాయతీలోని ప్రధాన సెంటర్లన్నీ కిటకిటలాడాయి. వీరుగాక చాలామంది టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిపై అభిమానంతో ఉద్యోగాల్లో స్థిరపడిన వారు స్వచ్ఛందంగా రిజర్వేషన్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కనిగిరికి చెందిన సాఫ్ట్‌వేర్, బ్యాంకు ఉద్యోగి కనిగిరిలో ఓటు వేసేందుకు ప్రైవేట్ ట్రావెల్స్‌లో రూ.4200 సీటు రిజర్వు చేయించు కున్నట్లు ఆంధ్రజ్యోతికి తెలిపారు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ ట్రావెల్స్ బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నుంచి శుక్ర, శని, ఆది, సోమవారాల్లో సర్వీసులను పెంచారు. ఉన్న ఆర్టీసీ బస్సులలో ఎక్కువ భాగం ఎన్నికల విధులకు ఉపయోగించటంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కొరతతో వలస ఓటర్లు సతమతమవుతున్నారు. రాష్ట్రంలోని చాలా మండలాలోన్ని వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆటో వాళ్లు కూడా విపరీతంగా రేట్లు పెంచేశారు. తప్పనిసరి పరిస్థితిలో ఖర్చుపెట్టాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓటుకు నోటు అంటున్నారు కాని ఇచ్చిన నోటు చార్జీల రూపంలో ఇలా ఖర్చుపెట్టాల్సి వచ్చిందని మరికొందరు వాపోతున్నారు.

---

## తెనాలి వైసీపీ నాయకుడి దౌర్జన్యంపై చర్యలు తీసుకోండి

**- జిల్లా ఎన్నికల అధికారికి, కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు**



**గుంటూరు (చైతన్యరథం):** తెనాలి వైసీపీ అభ్యర్థి స్థానిక శాసనసభ్యుడు, అతని అనుచరులు ఓటర్లపై దాడికి పాల్పడటంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారితో పాటు కలెక్టర్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ రాజీవ్ ఆనంద్‌లు ఫిర్యాదు చేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ... తెనాలి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పోలింగ్ బూత్‌లోకి అక్రమంగా ప్రవేశించబోగా ప్రశ్నించిన సాధారణ ఓటరుపై శివకుమార్ అతని అనుచరులు దాడి చేశారని, క్యూలైన్లో కాకుండా శాసనసభ్యుడు అతని అనుచరులు పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించే క్రమంలో క్యూ లైన్లో ఉన్న ఓటరు అభ్యంతరం వ్యక్తం చేశారని... దీనిపై ఆగ్రహించిన అన్నాబత్తుని శివకుమార్ అతని అనుచరులు సదరు ఓటరుపై దాడి చేసి విచక్షణరహితంగా కొట్టారని అన్నారు. పోలింగ్ బూత్‌లోకి అక్రమంగా ప్రవేశించటానికి ప్రయత్నించడమే కాక ఓటర్లపై దాడి చేసిన ఘటనపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు.

## ఎన్నికల్లో వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్న టీడీపీ కమాండ్ కంట్రోల్ సెంటర్

**- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని నేతృత్వంలో కమిటి**
**- జిల్లా వ్యాప్తంగా ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్యాల పై రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ అధికారులకు ఫిర్యాదు**
**- పోలింగ్ కేంద్రాల పనితీరు, టీడీపీ కార్యకర్తలపై వైసీపీల దాడులుపై పోలీసులకు ఫిర్యాదు**



ఒంగోలు (చైతన్యరథం): 2024 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా వైసీపీ సాగిస్తున్న ఆగడాలకు తెలుగుదేశం బిజెపి జనసేన ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సభ్యులు అడ్డుకట్ట వేస్తున్నారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సూచనల మేరకు టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ నేతృత్వంలో జిల్లా పార్టీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో వైసీపీ శ్రేణులు టిడిపి కార్యకర్తలపై చేస్తున్న దాడులు, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, దొంగ ఓట్లను అరికట్టడం, పోలింగ్ నిలిచిపోయిన కేంద్రాల్లో అదనపు సమయం, అవసరమైన పోలింగ్ కేంద్రాల వద్ద మరింత పోలీసు బందోబస్తుల ఏర్పాటు కోసం కమాండ్ కంట్రోల్ సభ్యులు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి పోలింగ్ అధికారులతో పోలీసులతో అనునిత్యం చర్చలు జరిపారు. పోలింగ్ కేంద్రాల్లో టిడిపి కార్యకర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులను నియోజకవర్గ ఎఆర్ఓ లకు, జిల్లా ఎన్నికల ఫిర్యాదు కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించారు. టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్‌లకు, నాయకులకు, బూత్ ఇంచార్జి లకు ఎన్నికలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు అందించారు. ప్రకాశం జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ కమిటీ సభ్యులుగా ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసుల రెడ్డి , ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వై.వి సుబ్బారావు, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి అంజనేయులు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మొగల్ కాలేషా బేగ్, టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి డాక్టర్ పసుపులేటి పాపారావు, కనిగిరి నియోజకవర్గ మాజీ ఎంపీపీ బేర్ పుల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎన్నికల నిబంధనలు ఆ వాలంటీర్‌కి వర్తించవా..?

**- ఎన్నికల బూత్ వద్ద కందులాపురం లో పనిచేస్తున్న వాలంటీర్**
**- పోలింగ్ బూత్ వద్ద అధికారులతో మంతనాలు**

గిద్దలూరు (చైతన్యరథం): ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం కంభం మండలం లోనీ ఎం పీ డి వో కార్యాలయం వద్ద బూత్ నెంబర్ 37,39 వద్ద ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధముగా పోలింగ్ బూత్ వద్ద కందులాపురం సచివాలయం 3 లో పనిచేస్తున్న ఓ వాలంటిర్ దర్శనమిచ్చాడు. పోలింగ్ బూత్ వద్ద వాలంటిర్ అధికారుల తో మంతనాలు పెడుతూ ఏమి చేస్తున్నాడో



అర్థం కావడం లేదు. అంతే 100 మీటర్ల పరిధిలో రాకూడదు అని నిబంధనలు ఉన్నా, ఇలా నిబంధనలు మీరీ వస్తున్నా కానీ అధికారులు మాత్రం మౌనంగా ఉన్నారు.ఎందుకు ఇలాంటి వారిని పట్టించుకోరనీ పలువురు గుసగుసలాడుతున్నారు.

## ఓటమి భయంతోనే దాడులకు పాల్పడుతున్న వైసీపీ

**- గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్**



గుంటూరు (చైతన్యరథం): ఓటమి భయంతోనే వైసీపీ టీడీపీని టార్గెట్ చేసుకుని దాడులకు పాల్ప డిందని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో జరుగుతున్న నేపథ్యంలో గుంటూరు తూర్పు,పశ్చిమ నియోజకవర్గాలలోని పోలింగ్ బూత్ లను పరిశీలించారు. వైసిపి దొంగఓట్లు వేసే ప్రయత్నాన్ని ప్రభాకర్ అడ్డుకున్నారు. బూత్‌లోకు వైసీపీ నాయకులు అక్రమంగా చొరబడి ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారని ఆరోపించారు. వైసీపీ చేస్తున్న అరాచకాలను అడ్డుకోవాలని పోలీస్ అధికారులతో ప్రభాకర్ వాగ్వాదానికి దిగారు. ప్రశాంతగా జరుగుతున్న పోలింగ్ ను వైసీపీ నాయకులు కాలనే బయటనుంచి జనాలను తెచ్చి గొడవలకు దిగరని ఆరోపించారు. వైసీపీ అరాచక పాలనను ఇంటికి సాగనంపేందుకు ప్రజలు కంకణం కట్టుకొని ఓటు వేసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చారన్నారు.

# తూర్పులో హ్యాట్రిక్ కొడతా చంద్రబాబు నాయుడికి కానుకగా ఇస్తా..!

**- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు**



**విజయవాడ తూర్పు (చైతన్యరథం):** జూన్ 4వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల లెక్కింపులో తాను పెద్ద మెజార్టీతో గెలిచి నారా చంద్రబాబు నాయుడుకి కానుకగా ఇస్తానని గద్దె రామ్మోహన్ తెలిపారు. సోమవారం సాయంత్రం గుణదల పెద్ద బోర్డింగ్ స్కూల్లో పోలింగ్ విధానాన్ని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నలు పరిశీలించారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. పార్టీ తనను అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచి తన విజయం కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన తెలుగుదేశం, జనసేన, బి.జె.పి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు, తూర్పు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అందరికీ గద్దె రామ్మోహన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

**295వ బూత్లో ఓటు హక్కు వినియోగించుకున్న గద్దె రామ్మోహన్**

చైతన్య టెక్నో స్కూల్ గద్దె రామ్మోహన్ సతీసమేతంగా ఓటు హక్కును వినయోగించుకున్నారు. గద్దె రామ్మోహన్తో పాటు గద్దె అనురాధ వారి కుమారుడు గద్దె రాజేష్ ఓటు వేయడం జరిగింది. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. ప్రజా స్వామ్య పరిరక్షణే ధ్యేయంగా అనేక మంది వారి ఓట్లను వినియోగించుకున్నారని వారిందరికీ గద్దె రామ్మోహన్ అభినందనలు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా తూర్పు నియోజకవర్గంలో 70 శాతంకు పైగా ఓటు నమోదు జరిగిందని, ప్రజలు ఉదయం నుంచి బారులుతీరి ఎటువంటి అసహనానికి గురికాకుండా వారి ఓటు హక్కును వినియోగించు కున్నారన్నారు. శాశించే వారు కాదు శాసనాలను అనుచరించే ప్రభుత్వమే కావాలనే ఉద్దేశ్యంతోనే ప్రజలు పోలింగ్లో పాల్గొన్నారన్నారు.

## కంభంపాడులో ఎంపీ అభ్యర్థి శివనాథ్ కారుపై దాడికి యత్నం

- **శివనాథ్ బృందంపై వైసీపీ గుండాలు రాళ్ల దాడి**
- **క్షణికావేశానికి లోనుకాకుండా శాంతియుతంగా వ్యవహరించిన చిన్ని**
- **తిరువూరులో సుడిగాలి పర్యటన**
- **ఆరు పోలింగ్ బూత్ కేంద్రాలు సందర్శన**



**తిరువూరు (చైతన్యరథం) :** టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరు పోలింగ్ కేంద్రాలను సోమవారం సందర్శించారు. ఈ నియోజకవర్గంలో కేశినేని శివనాథ్ వెళ్లిన కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్ కేంద్రం వద్ద వైసిపి గుండాలు బరితెగించారు. కేశినేని శివనాథ్ ను రెచ్చగొట్టేందుకు అసభ్య పదజాలంతో వినపడేలా దూషించారు. ఆయన ఎక్కడ క్షణికావేశానికి లోనుకాకుండా శాంతియుతంగా వ్యహరించారు. బూత్ కేంద్రం నుంచి బయటికి వచ్చే సమయంలో వైసిపి గుండాలు ఆయనపై దాడికి యత్నించగా సెక్యూరిటీ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి కారు ఎక్కించి రౌడీ మూకల నుంచి తప్పించారు. వైసిపి గుండాలు కేశినేని శివనాథ్ బృందంపై కూడా ఇటుక రాళ్లతో దాడి చేశారు. బూత్ కేంద్రం వద్ద పోలీసులు వున్నా వైసిపి గుండాలు రెచ్చిపోవటం ఓటర్లను ఆశ్చర్యానికి గురి చేసింది. కేంద్ర బలగాలు రావటంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

తిరువూరు నియోజకవర్గంలో సోమవారం కేశినేనిశివనాథ్ ముందుగా ఎ.కొండూరు మండలంలోని రామచంద్రపురం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం, చీమలపాడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం, ఎ. కొండూరు మండలంలోని కంభంపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం, గంపల గూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం, గంపలగూడెం మండలం పెను గొలను గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం, గంపలగూడెం మండలం దుందిరాలపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ పర్యటనలో కేశినేని శివనాథ్ పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని, ఏర్పాట్లను గమనించారు. ఎన్నికల అధికారులతో మాట్లాడారు. ఓటింగ్ పర్సంటేజ్ వివరాలు అడిగి కనుక్కొన్నారు. ఓటర్లకు చేసిన ఏర్పాట్లు అడిగి తెలుసుకోవటం తోపాటు ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపించాలని కోరారు. ఇక కంభంపాడులో జరిగిన సంఘటన పై ఎన్నికల అధికారులకి కేశినేని శివనాథ్ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.కొండూరు మండల పార్టీ అధ్యక్షుడు గద్దీ కృష్ణారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు, తెలుగు యువత గంపలగూడెం మండల అధ్యక్షుడు ఎమ్మార్కేలతో పాటు స్థానిక ఎన్డీయే నాయకులు పాల్గొన్నారు.

## పొన్నూరులో వైసీపీ అభ్యర్థి అంబటి మురళీ బరితెగింపు

- **నేరుగా పోలింగ్ బూత్‌లో తిష్ట**
- **అభ్యంతరం వ్యక్తం చేసిన కూటమి శ్రేణులు... చోద్యం చూసిన పోలీసులు**



**పొన్నూరు (చైతన్యరథం) :** నియోజకవర్గం చింతలపూడి గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీ బరితెగించి ప్రవర్తించారు. నేరుగా పోలింగ్ బూత్ లోకి ప్రవేశించడమే కాకుండా అక్కడే కుర్చీలో కూర్చుని టీడీపీ జనసేన బీజేపీ కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఇంత జరుగుతున్నా అక్కడున్న పోలింగ్ అధికారులు గానీ, పోలీసులు గానీ అతనిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. అంబటి మురళి చర్యలను కూటమి శ్రేణులు సైతం దీటుగా బదులు ఇవ్వడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. దీంతో అధికారులు సైతం అంబటి మురళికి వత్తాసు పలుకుతూ కూటమి శ్రేణులతో వాగ్వాదానికి దిగారు. ఈ వ్యవహారంపై చింతలపూడి ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎన్డీయే కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కుమార్తె వైదీప్తి పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఆర్వో అధికారులకు ఫిర్యాదు చేయడంతో విధిలేని పరిస్థితుల్లో అంబటి మురళిని పోలీసులు అక్కడ నుంచి బయటకు పంపించారు. ఈ ఘటనపై తాము ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని కూటమి శ్రేణులు వెల్లడించాయి.

# విజయం మాదే మాజీ మంత్రి పరిటాల సునీత ధీమా !

- **రాప్తాడులో పోలింగ్ శాతం భారీగా పెరిగింది**
- **ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది**
- **నసనకోటలో ఓటు హక్కు వినియోగించుకున్న సునీత, ఇతర కుటుంబ సభ్యులు**
- **పలుచోట్ల వైసీపీ నాయకుల అరాచకాలపై సునీత మండిపాటు**



**రాప్తాడు (చైతన్యరథం):** నియోజకవర్గ ఓటర్లలో కచ్చితంగా చైతన్యం కనిపించిందని.. ఈసారి వారు మార్పు కోరుకున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆమె సోమవారం ఉదయం నసనకోటలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించు కున్నారు. ధర్మవరం ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ తో పాటు ఇతర కుటుంబ సభ్యులంతా క్యూలైన్లలో నిలబడి ఓటు వేశారు. అనంతరం ఆమె నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తూ పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. ఉదయం కొన్నిచోట్ల పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంపై వెంటనే జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మరికొన్ని చోట్ల సమస్యలపై కూడా ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంకోవైపు నియోజకవర్గంలో చాలా చోట్ల హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. తోపుదుర్తి, మేడాపురం, నామాల, మద్దలచెరువు, నెమలివరం తదితర గ్రామాల్లో వైసిపి నాయకులు అరాచకాలకు పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పరిటాల సునీత వెంటనే జిల్లా ఎస్పీ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. చాలా చోట్ల పోలింగ్ నెమ్మదిగా సాగింది. దీంతో ఆరు గంటల తర్వాత కూడా క్యూ లైన్ లలో భారీగా జనం కనిపించారు. రాప్తాడు మండలం, బండమీదపల్లి గ్రామంలో ఈవీఎంలు సరిగా పనిచేయక క్యూలైన్లలో ఉన్న ఓటర్ల పరిస్థితిని పరిశీలించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ముందుగా మహిళలకు అవకాశం కల్పించి వారు తొందరగా ఓటు హక్కు వినియోగించుకొనేలా అధికారులతో మాట్లాడారు.

ఎంతమంది క్యూ లైన్ లో ఉన్నా వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అవకాశం కల్పించాలని సునీత కోరారు. మొదటి నుంచి వైసీపీ నాయకులు అరాచకాలకు పాల్పడుతూ వస్తున్నారని... చివరకు పోలింగ్ రోజు కూడా వారి ఆగడాలు ఆగలేదన్నారు. అయినప్పటికీ ప్రజలు ఒక స్పష్టమైన నిర్ణయంతో ఓటు వేశారని అన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నట్లు స్పష్టంగా కనిపించిందని ఆమె అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలందరికీ ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

